శ్రీ

చింతామణి.

ఇది మాసమునకొకసారి ప్రకటింపఁబడును.

సంపుటము ౬] రాజమహేంద్రవరము. హేవిళంబి సంవత్సర వైశాఖమాసము. [సంచిక. ౧౧.

SCIENCE PAPER SERIES No 3

SOUND — శబ్దము.

(౪౪౪ - పుటశేషము)

ధ్వని చలనముగనుకను, ఈ చలన మితరపదార్థములగుండ స్వభావసిద్ధముగఁ బ్రసరించును గనుకను, చలనప్రసారముల నొక తగుపాటి ద్రవ్యముపై చేర్పవచ్చును. ఇందుకు నిదర్శనముగ గంటమువలెనున్న సన్నపాటి కలము నొకదానిని సంపాదించి యా కలమును మైనముచేత తగుపాటిస్థలమున బాగుగ మ్రోయు గంటపై చేర్పవలెను. అటుపిమ్మట నీ కలమున కెదురుగ నలుపుచేయఁబడిన కాకిబంగారపురేకు నుంచినచో గంట మ్రోయునప్పుడు గలుగు చలనము కలమునందు ప్రవేశించును దీని ప్రసారములు వంకరగీతలవలె నా సన్నని రేకుపై వ్రాయఁబడును ఇదియే ఎడిసన్ (Edison) దొరవారి (Ponograph) ఫోనోగ్రాపు అను మహాయంత్ర నిర్మాణమున కాదికారణము ఆ యంత్రమునందు, ఈపైని చెప్పఁబడిన కలమువంటి కలమును, ఆ సన్నని రేకువంటి రేకునుగూడ నుండును. పైనుదాహరింపఁబడినట్లు గంటధ్వని చలనము గాక మనుజులు మాటాడునప్పుడు కలుగు వాయుచలనములు ఆయంత్రమున నొకవిధమైన మృదువయిన రేకుపయి లిఖింపఁబడును. ఈ వ్రాఁతవలన అమితమైన యానందము మానవకోటికి కలుగనేరనైయున్నది. గొప్పగొప్ప ఉపన్యాసకులు విద్వాంసులు చనిపోయినను వారివారి యుపన్యాసములను నీతివాక్యములను వారివారి స్వరములతోను ఉచ్చారణతోను వినుట కీ యంత్రము లేయాధారములు ఇట్టి యంత్రమును కనిపెట్టిన ఎడిసన్ దొరవా రెంతవిద్వాంసులై యుండవలెనో మేమిక్కడ వక్కాణింప నావశ్యకము లేదు వీరలు ప్రపంచమందుండు ముఖ్యప్రదేశములఁ దిరిగి జనులకీయంత్రమువలని యానందము కలుగఁజేసినవారు ఆహా! ఏమి యీమహిమ! ప్రకృతిశాస్త్రము వలనఁ గలుగు లాభము లింతటితో సరియని చెప్పుట కెవరికిఁగాని శక్యముగాకున్నది.

విషయసూచిక.

శ్రీ

చింతామణి.


ఇది మాసమునకొకసారి ప్రకటింపఁబడు.

సంపుటము ౬] రాజమహేంద్రనగరము. హేవిళంబి సంవత్సర చైత్రమాసము. సంచిక. ౧

కృతివిమర్శనము.

ఉపన్యాసచంద్రిక.— గుంటూరు అమెరికన్ లూథరన్ మిషన్ కాలేజిలో నుపాధ్యాయులగు బ్రహ్మశ్రీ మల్లాది వేంకట సోమయాజులుగారిచేఁ జేయఁబడిన యుపన్యాసచంద్రికయను నిరువదినాలుగుపుటలుగల చిన్నపుస్తక మొకటి మాకుఁ బంపఁబడినది. ఇది పదిప్రకరణములుగా భాగింపఁబడియున్నది. ఇందలి "గ్రామ్యోక్తులు" అను శీర్షికగల యేడవప్రకరణము విద్యార్థుల కత్యంతోపయుక్తమనుటకు సందేహము లేదు. ఇందుఁ జూపఁబడిన గ్రామ్యరూపములు సర్వసా రణముగా వాడుక చేయఁబడునవి కొన్నియైనను, ఎవండ్లు, వాండ్లు, అల్లుండ్లు, ఎవర్లు, మొదలయిన పదముల నీప్రాంతములయందు గ్రామ్యభాషలో సహితము వాడుచున్నట్టు మేము చూడలేదు. సంధులు మొదలయిన యంశముల నింత చిన్నపుస్తకములో నింత సంక్షిప్తముగా వ్రాయఁబడినవానిని జదువుటకంటెఁ గొంత పెద్దవ్యాకరణములో వివరముగాఁ జదువుట యెక్కువ యుపయోగకరమగుటచే గ్రంథకర్త యీవిషయములనుగూర్చి యొక పెద్దపుస్తకమును రచియించునని నమ్ముచున్నాము. 'వద్ద' అను రూపము తప్పనుట సరికాదు. భారతప్రయోగము లేకపోయినను, రంగనాథరామాయణము మొదలైన పురాతనగ్రంథములలోను సమస్తాధునికగ్రంథములలోను వద్దనురూపము కానఁబడుచున్నది. "అట్టు" మొదలైనవాని ద్వితీయా బహువచనరూపములు "అట్టులన్" మొదలైనవనుట విచారణీయము. మొత్తముమీఁద నీపుస్తకము విద్యార్థుల కుపయోగకరమయినదని మేము దృఢముగాఁ జెప్పఁగలము. వలయువారు గ్రంథకర్తగారికి గుంటూరు వ్రాసి పుస్తకములను దెప్పించుకోవచ్చును.

పగడపుఁదీఁగెలు.



మనదేశమునందు పగడములను చూడనివారెవ్వరు నుండకపోయినను, పగడము లెట్లువచ్చు తెలియనివారనేకులుండవచ్చును. పగడములు సముద్రములోనుండు నొకజాతి చిన్నపురుగులచేతఁ జేయఁబడును. భూమిమీఁద చెదపురుగులు కొంచెకొంచెముగా మన్నుచేర్చి పుట్టలుపెట్టువిధముననే సముద్రములో పగడపుపురుగు లసంఖ్యముగాఁ జేరి యెడతెగకపనిచేయుచు సముద్రముయొక్క యడుగుభాగమునుండి పుట్టలుపెట్టుకొనుచువచ్చి కొంతకాలములో నీటి పయిభాగమువఱకును దీసికొనివచ్చును. ఈ పురుగులుపెట్టెడు పుట్టలు చెదపుట్టలవలె నీటికి కరఁగిపోవునవిగాక రాతివలె గట్టిగా నుండును. సూక్ష్మాతిసూక్ష్ములయిన యీ పురుగులు పెట్టెడి యీ పుట్టలను మనవారు పగడపుఁదీఁగెలందురు. పగడపుఁదీఁగెలయొక్క యాకారము పైపటమునఁ జూపఁబడియున్నది. ఈ చిన్నపురుగులు పెట్టెడు పుట్టలు మహావృక్షములవలె శాఖోపశాఖలుగా నీటియడుగుననుండి పైవఱకును లేచుటయేకాక కాలక్రమమున సముద్రమధ్యమునందు ద్వీపములుగా నేర్పడును. హిందూమహాసముద్రములోనున్న లక్షద్వీపములును మలయద్వీపములు నీప్రకారముగా నేర్పడినవేయని చెప్పుదురు. ఈ పురుగులు పెట్టినపుట్టలు ద్వీపములుగా నేర్పడినతరువాత వానిపయిని మన్నుపడి గాలికెగరఁగొట్టుకొనివచ్చియు దేశసంచారముచేయు పక్షులచేతఁ దీసికొని

రాఁబడియు విత్తనములుపడి వానిమీఁద వృక్షములును పైరులును పెరిగి మనుష్యులకు వాసయోగ్యములగును. సింహళద్వీపములోని జాఫ్నానగరములోనుండెడి యిండ్లనేకములు సమీపముననున్న ప్రవాళపర్వతములనుండి తేఁబడిన పగడపురాళ్లతోఁ గట్టఁబడినవిగానున్నవి. ఈ ప్రవాళ లతలు నానావర్ణములుకలవిగానుండినను, బహుతరముగా తెల్లనివిగానుండును. వీనిలో నెఱ్ఱరంగుగలవానికి వెలహెచ్చు. ఎఱ్ఱ పగడములు భూమధ్యసముద్రమునందును శోణసముద్రమునందును విశేషముగానుండును. వీనిని మనదేశమునందును మఱికొన్ని యితరదేశములయందును నగలలోనుపయోగించుకొందురు, పుటముపెట్టి ప్రవాళభస్మమనుపేర నౌషధముగా సహితముపయోగించుకొందురు ఈ యెఱ్ఱపగడపుఁదీఁగెలను సంపాదించుటకయి మనుష్యులోడలలో నెక్కిపోయి ప్రవాళపర్వతములలో నివి పెరుఁగుచున్నచోట్ల గాలములువేసి వాని నా తీఁగలకుఁ దగిలించి లాగుదురు. వీనిని పెకలించి పైకిలాగుట మిక్కిలి కష్టము. అయినను మిక్కిలి ప్రయాసపడి ప్రవాళలతలకొమ్మలు విఱుగఁదీసి పడవలలోనికి లాగి తరువాత వానిని కడిగి శుభ్రముచేసి పడవవాండ్రాభరణములనిమిత్తము వానిని వర్తకుల కమ్ముదురు.

మాలతీ రాజహంసము.

ADAPTED FROM TENNYSON'S LADY CLARE

తేటగీతలు.

మావులన్నియుఁ జిగురుజొంపములఁ బొదల । బొండుమల్లెలు కన్నులపండువై వ
సంతలక్ష్మికిఁ దొడవైయెసంగ నొక్క । భాసురంబైన మధుమాసవాసరమున.
రాజహంసుఁడు నాకొక్క రాకొమరుఁడు । చిరసమీహిత నిజమనోహరవధూల
లామ గుణధామ మాలతీలలనతోడఁ । దనదు పెండిలి రేపను తమకమునను.
తగు నుపాయనముగ దొడ్డమృగినొకటిని । దెచ్చి యర్మిలినిచ్చి తా నిచ్చఁజనియె
మాలతియు మేనయత్తకుమారుఁడైన । తనదుప్రియు నచ్చపుంబ్రేమఁ దలఁచి మిగుల
ముదితమానసయై తలపోసె నిట్లు —
"వరుఁడు నన్గోరుటది నన్నె వలచిగాని । నాదు కులమును భాగ్యంబు నావిశాల
ఫలదమంచిత రాజ్యసంపదలుఁ దలఁచి । కాదుసుమ్మిదె కాదె సుఖంబునకిఁక."
ఇంతలోపలఁ దనధాత్రి యేగుదెంచి । యపుడు పలుకాడి యరిగినయాతఁ డెవ్వఁ
డనిన మాలతి "నాదు మేనత్తకొమరుఁ । డతఁడు నను నెల్లి పెండిలియాడు"ననియె.

"నీకుఁ జెందెడు రాజ్యంబు నిన్నుఁ బాసి । రాజహంసుని దెస నిజప్రభుని గనెనె
ఏమి నుతియింపవచ్చు సర్వేశు న్యాయ । మహహ యీభువినెల్లచో" ననియె ధాత్రి.
"ఏలనెత్తితివె యీరీతి జేలఁబోలి । పల్కెద"వనంగ విని మాటు పల్కె ధాత్రి
"శంక యేవంతవలవ దీశ్వరుని యాన । రాజహంస నియదియపో రాజ్యమెల్ల
నీవు నాపట్టి విదిసుమ్ము నిశ్చయమ్ము
వినుము మును చన్నప్రభు నిజతనయ చిఱుత । ప్రాయమున నాదు స్తన్యంబుద్రావుతఱినె
కాలగతిఁ జెందినను నాదు కన్నకూఁతుఁ । బోలె నాచేతనే దాని బూదిఁగలిపి
రాజపుత్రిఁగ నప్పు డేర్పఱచితి నిను."
"ఇది నిజంబేని యక్కటా యెంతపాప । మునకు నొడిగట్టితి వట్టి జనవరేణ్యుఁ
బూర్వసముపస్థితానల్ప భూప్రభుత్వ । మునకు బహువర్షములువాపి మోసమునను"
అనిన విని ధాత్రి మాలతి కనియెఁ బ్రీతి । "నీవు మనియెడు నన్నాళ్లు నిది రహస్య
ముగను దాఁచెదనేని నీమగఁడు నిన్నుఁ । జేరఁగనె నీదు రాజ్యంబు చేరునతని"
అనిన మాలతి "నీమాఁటున గునునేని । దాఁపురంబొల్లఁ దెల్పెదఁ దథ్యమెల్లఁ
గాన నూడ్చుము నామేని కనకవలయ । రత్నభూషణ తారహారాదు"లనుచు.
తల్లి పలుమాఱు చేయుప్రార్థనలనెల్ల । సరకుసేయక యెంతయు శంకితాత్మ
యగుచు "నైనను మగవాని యంతరంగ । మునను విశ్వాస మణుమాత్రమును మసలక
యున్నె చూతము గాక"ని యూరకుండె.
"ఏమి విశ్వాసమమ్మ యోకోమలాంగి । రాజహంసుఁడు గైసేయు రాజ్యలక్ష్మి,
వాని కటువయి మాలతివట్టిపొందు । గావలెనె"యన్నఁ దల్లికిఁ గన్యయనియె
"జనని నాకేమినూఁడిన సైతుఁగాని । సైఁపనోపను గష్టమాసజ్జనునకు."
"ఏమె నాతల్లి నీకుఁగా నింతపాత । కమునకెల్లను నేనొడిగట్టితిఁగదె
ముద్దుగొననీయవమ్మ యోముద్దుగుమ్మ" । అనిన తల్లికిఁ జెక్కిలి యప్పగించి
జనని యొసఁగెడు నఖిలదీవనలువడసి । యంత మాలతి స్వేచ్ఛావిహారపరత
రంగుమాసిన జీర్ణవస్త్రంబుగట్టి । ముగ్ధమంచార మవతంసముగనొనర్చి
విగతభూషణయై పేదముగుదవోలె । వెడలెఁ గేదారసీమలవెంట నపుడు.
రాసుతుఁడు దెచ్చియిచ్చిన రమ్యమృగియు । వేగమున లేచి మాలతి వెంటనంటి
హస్తమున మస్తకంబిడి యలరుప్రేమ । నామెతో నెల్లచోటుల కరుగుచుండె.
రాజహంసుఁడు తనకు హర్మ్యమ్మునుండి । యంతయును జూడఁగనె డిగ్గి యామెఁజేరి
"భువనమోహన సౌభాగ్యపూర్ణవయ్యు । గ్రామ్యకన్యకఁబోలి యీకరణినీవు
జీర్ణవస్త్రము లివిగట్ట సిగ్గుగాదె."

అనిన మాలతి యాతనికనియె నెలమి । “గ్రామ్యకన్యకరీతి నెగడెదనేని
నాదుభాగ్యంబు నంతియు నరవరేణ్య । నేను దాసీతనూజను రాణిఁగాను”
రాజహంసుఁడు పల్కు “నో రమణి నీదు । పల్కులెంచుకయును బోధపడవదేల
నేఁ ద్రికశుద్ధిగ నీవాఁడ నిశ్చయమిది । మాయలన్నియు నావంకమాను మింక.”
అనుడుఁ జెలువుని యాననంబాన్మృగాక్షి । యప్పుడు పరికించి గతసంశయాత్మహృదయ
యగుచు నెంతయు మదిని ధైర్యంబు గదుర । విభునకెల్లను దనకథ విన్నవించె.
అంత నతఁడనుఁ బ్రేమ యినగవంకురింప । ముదిత చెక్కిలి గొబ్బున ముద్దుగొనుచు
“ఏలికకు నీవు జనియింపవేని నేను । సన్నిహితకర్తనేనియు శంకవలదు
నాకు నర్ధాంగలక్ష్మివైనదినమున నె । రాజ్యమునకెల్లఁ గావోకో రాణివీవు”

SCIENCE PAPER SERIES No. 3

SOUND — శబ్దము.

సూక్ష్మతరములైన యణువులనేకములు గలిసినంగాని యేపదార్థము నేర్పడదు. ఈయణువుల కేవిధమునైన చలనమును గలుగఁజేసినచోఁ గొన్నికొన్ని విచిత్రములైన గుణము లుద్భవిల్లుచుండును. ఉష్ణమును శబ్దమును నిట్టి యణుచలనమువలనఁ గలుగుచుండు గుణములు.

నాదము నిచ్చుచున్న యేవస్తువుగాని కంటికి చలనరహితముగనే కాన్పించును. మ్రోయుచున్న గంటగాని, బిందెగాని, మరి యేదైననుంగాని ఒకచోటినుండి మరియొకచోటికి కదలుచుండునట్లు మన మెప్పుడును చూడఁబోము. కాని శబ్దించు సమయమున నాగంటను చేతితో మనము సూక్ష్మముగఁ దట్టినచో త్వగింద్రియము వలన మనకు చలనము గోచరమగును. చేతితో తట్టినయెడల ఆ చలనము నశించి మనకు నాదము వినిపించనేరదు. ఇందుకు నిదర్శనముగ నతి దృఢముగ మ్రోఁగుచున్న గంటను చేతితో బలముగ నణచితిమా యానాద మంతరించుట నిశ్చయము. ఇది యందఱకును అనుభవనీయమని వేఱుగా చెప్పనక్కఱలేదు.

చలనమున్నదియు లేనిదియు దృఢపఱచవలెనన్నయెడల, ఒక సన్నని దారపు ముక్కకు గుండ్రనిపూస యొకటి వ్రేలాడఁగట్టి దీనికొన నొకచేతితోఁ బట్టుకొని మ్రోయుచున్న గంటవద్దకు తీసికొనిపోయి పూసను గంటకు అంటియుండునట్లుంచితిమా యాపూస అతిత్వరితకాలములో గంటనుండి త్రోయఁబడి వెనకకును

ముందరకును కదలుచుండును. తగినంత కారణము లేక చలన మెన్నఁడుగాని కలుగ నేరదు ఆపుంసయం దిదిపటలో నట్టిచలనము లేనిగాన నిశ్చయముగ శబ్దము నిచ్చుచున్న గంటవలననే పూర్వకే చలనము కలిగినది

ఇంతియగాక ఒకపాత్రయందు అంచువఱకును నీరుపోసి అటువెనుక ఫిడేలు వాయించు బద్దెతో సూక్ష్మముగ నాపాత్ర యంచువెంబడిని ఱాచినచో లోపలనున్న నీటియణువు లతిత్వరితముగ చలించుచుండును. ఈసమయమునందు శబ్దముగూడ నుద్భవించుచున్నది గనుక చలనమువలననే ధ్వనిగలుగుచున్నదని నిశ్చయముగ నమ్మవచ్చును. కాని యిట్టి శబ్దచలనము పుట్టినస్థలములనుండక నలుదిక్కులకుఁ బదార్థములగుండ పాఱుచుండును. పదార్థము లేనిచో శబ్దము ప్రవహింపనేరదు.

ప్రపంచమునందుండు పదార్థములన్నియు మువ్విధంబులనున్నవి—రాయి కఱ్ఱ మొదలగు పదార్థములు కొన్ని ఘనములుగను, నీరు నూనె మొదలగు మఱికొన్ని ద్రవపదార్థములవలెను, గాలివలె నింకను కొన్ని వాయురూపంబునను, స్వభావజనితములై యున్నవి.

సాధారణముగ శబ్దచలనము ఆయా వివిధరూపంబులఁ బరఁగు పదార్థముల గుండఁ దరలుచుండును. ఇట్టి కారణములవలననే నీటిలోమునిఁగి స్నానముచేయుచున్నవాఁడు బయటనుండి చెప్పుచుండినవాని మాటలు వినవచ్చును. పైని సరంబీ చేయఁబడి నలుప్రక్కల దిట్టమైన గోడలతో మూయఁబడిన గదిలోనున్న మనుష్యుఁడావలిమాటలను సూక్ష్మముగ గ్రహించును. కాని గాలిమార్గముననే సాధారణముగ శబ్దము పోవుచుండును.

ఏపదార్థముగాని కొట్టఁబడినప్పుడు కొంచెము ధ్వని నిచ్చుచుండును. ఇట్లు కొట్టఁబడినందువలన పదార్థములోని యణువులు కదలిచలింప నారంభించి తమ చలనమును దగ్గరనున్న యణువులయందు ప్రసరింపఁజేయుచుండును. ఇట్లే ప్రతిశబ్దమును వాయుపథంబునఁబడి యా పదార్థముగుండ మనచెవిచొచ్చి మనకాధ్వనిని వినిపింపఁ జేయును. దీనిని నిదర్శనముచూడవలెనన్న రెండువైపుల తెఱచియుండిన సామాన్యపు గాజుగొట్టమును సంపాదించి ఆగొట్టపు మూతులను సన్నని కాకితముతోఁగాని తోలుతోఁగాని మూయవలెను. అటుపిమ్మట ఈగొట్టమును నేపాధనముపైన నడ్డముగఁ బట్టియుంచి ఒకమూతియొద్ద గంటను వుంచి రెండవమూతియొద్ద త్రాడునకు వ్రేలాడుచుండునట్లొక జీలుగుపూస నొకదాని నుంచవలెను. గొట్టమున నొకవైపున గంటయున్నది. దాని రెండుమూతులును మూయఁబడినవి. గొట్టమునకు రెండవవైపున జీలుగుపూసయొకటి దానికంటియున్నది. వాయువుపసర్వవ్యాపిగనుక ఇండ్లలోన,

గుండ్లలోను, ఊరకయున్న పాత్రములలోను, బిందెలలోను, ఎల్లచోట్లను నుండి యున్నది. అందువలన నేయీ గొట్టములోపలను గూడ నుండియున్నది. అట్టిసమయంబున ఈగంట నెవ్విధంబుననైనఁ గొట్టినచో ఆవలపైపున సంబంధమేమియు లేకయుండినట్లు కనిపించు జీలుగుపూస అతిచిత్రముగఁ గదలనారంభించును. దీనికి కారణమేమై యుండవచ్చును. శబ్దము నిచ్చుచున్న గంట చలనము నారంభించును ఈ చలనము వాయుప్రసారమున గొట్టపుమూతియందు ప్రవేశించి ఆ పదార్థమందుండు అణురూపముల మార్గమున గొట్టములోని గాలియందు చలనము కలుగఁజేసి తదనంతరంబ రెండవమూతియందుండు పదార్థంబునంబడి వెలువడి తిరుగ వాయుపథమై జీలుగు పూసను దట్టును. ఇట్లే మన శ్రోత్రేంద్రియమందును శబ్దము ప్రవేశించుచున్నది.

(శబ్దచలనము వివిధపదార్థములయందు పలుపలువిధముల పోవుచున్నది కాని విద్యుచ్ఛక్తివలెను ప్రకాశమువలెను స్వల్పకాలమున నతిదూరము పోనేరదు. సాధారణముగ మనమొక ఏటియొడ్డున నుండినపుడు దూరముగనున్న చెట్లకుగొట్టుచుండిన గొడ్డలివాండ్రను చూచుచుందుము. అట్టిసమయమున కొద్దికాలము దృష్టి నాగొడ్డలి వానిపైనుంచినచో నొక విచిత్రమైనసంగతి మనము కనిపెట్టవచ్చును. గొడ్డలివాఁడు వంగి చెట్టును నఱకుట ముందు కనిపెట్టఁగలిగినను, ఆ దెబ్బవలనఁ గలుగు ధ్వనిని కొంత యాలస్యముగఁగాని వినలేము. ఈలాగుననే యాచెట్టునొద్దనుండి మఱియొకఁ డొకతుపాకిని పేల్చుచుండినచో ముందుగ పొగ కనిపించునుగాని దానివలనఁగలుగు ధ్వని మనకంతత్వరలో వినఁబడనేరదు. అట్లే దూరమున నేటియొడ్డున చాకలి వాండ్రు బట్టలుతుకునప్పుడు. వీరలు బట్టలు చేతఁబట్టి రాతిపైకొట్టుట యతిత్వరలో కనిపించినను శబ్దమంతత్వరలో వినఁబడనేరదు. దీనికి కారణమేమనఁగా ప్రకాశ మతివేగమున పోవుచున్నదిగనుక కాంతికిరణము లతిసూక్ష్మమున తరలి దూరమున జరుగుచుండిన సంగతులను త్వరలో మనకు గోచరమగునట్లు చేయును. కాని ధ్వని వలనఁ గలుగు చలనశక్తి యంతసూక్ష్మముగ పోనేరదు. పై నుదాహరింపఁబడిన చెట్టునకును మనముండు స్థలమునకు నున్నదూరము కొలిచి కాంతి మనకంటికి గోచరమైనపిమ్మట ఎన్నిసెకనులలో ధ్వని వినిపించినదో కనిపెట్టినయెడ ధ్వనియొక్క వేగమును గనుఁగొందుము. దూరము 1120 అడుగులైనచో ధ్వనిచేరుటకు క్షణము (One Second) మాత్రము పట్టును.

ఒక్కధ్వనియే వివిధసమయముల పలువిధములుగ మాఱిపోవుట కలదు. ధ్వని వాయుమార్గమునకంటె ద్రవమార్గమున నతిత్వరలో పోవును. ఇంతకంటె కఱ్ఱ మొదలైన కఠినపదార్థములగుండ ఎక్కుడు త్వరలో పోఁగలదు. దూరము హెచ్చిన

కొలఁది ధ్వని యొక్క బలము తగ్గిపోవును. ఇది నిశ్చయముగఁ గలుగవలసినదే గదా. శబ్ద ముద్భవిల్లుచుండిన పదార్థవిరళతనుబట్టికూడ కొంతమార్పు గలుగుచున్నది. ఎట్లన గంట పెద్దదిగానుండిన ఎక్కువధ్వని గలుగుచున్నది ఇంతియగాక ఎంత బలముగ శబ్దము గలుగచేయఁబడిన నంతవేగముగ శబ్దము వెడలిమనకు వినఁబడును.

శబ్దచలనప్రసారములు కాంతికిరణములవలెనె అడ్డుపరపఁబడినచో మళ్లింపఁబడి బయలువెడలిన స్థలమువైపు వచ్చుచున్నవి. మనమొక పర్వతగుహకు కొంచెము దూరముగ నిలుచుండి మాటాడినచో నా శబ్దచలనము గుట్టవలన నాపఁబడి మన వద్దకు చేరును ఇందువలననే తిరుగ మరియొకశబ్దము వినవచ్చుచున్నది. దీనినె <u>ప్రతిధ్వనియని పిలుచుచున్నారు.</u> కనుకనే నలువైపుల చక్కఁగ సున్నముచేసిన గోడలుగల పెద్దచావడిలో (మధ్యమధ్య ద్వారము లేవియు లేకుండినయెడ) నుండి మాటాడినపుడొ మాటకు ఒకటి రెండు మూడు ప్రతిధ్వనులు వినవచ్చును. అడ్డు పడునవి యెన్నియుండిన నన్నిమారులు శబ్దచలనము తిరుగఁగొట్టఁబడును. చాల లోతుగానుండిన నూతిలో మోము పెట్టి మాటాడినచో స్పష్టమయిన ప్రతిధ్వని మనము వినుచుందుము. ఇది యందఱకును దెలిసినయంశమే. శబ్దచలనము విరివియైన పదార్థప్రవేశమైనచో చలనబలము క్రమక్రమముగ తగ్గిపోయి తుద కంతర్ధానమవును. కాని యట్లుగాక యొక సన్నని నిడుపైన గొట్టములోపల ప్రసరింపఁజేసినచో చలన బలమేమియు తగ్గకుండునటులు చేయవచ్చును. మనలో ననేకులు పొగయోడ నెప్పుడైన చూచియుందురు. లోపల నెక్కడనో యుండి ధూమయంత్రమువద్ద పనిచేయుచుండిన దొర ఓడకుపైనున్నగదిలో నున్న యధికారితో కదలకయే తనయభిప్రాయములను దెలుపుచుండును. ఆ యధికారి గదికిని ఆ ధూమయంత్రమునకును మధ్య సన్నని నిడుపైన గొట్టమొకటి యమర్చఁబడియున్నది. ఆ యధికారి తన యాజ్ఞలను తెలియచేయవలసివచ్చినప్పుడు గొట్టమువైపుతిరిగి మాటాడును. ఈమాటలు స్పష్టముగ ధూమయంత్రమువద్దనున్న మనుష్యునికి వినఁబడును. అపాయకరమైన సమయములలో ఇట్టి సాధనములవలని ఉపయోగము లనంతములుగదా.

చెవుడుగలిగిన మనుజులు సన్ననిగొట్టములఁ జెవులలో నుంచుకొనియెదరు. ఇట్టి గొట్టములు బయట వెడల్పుగను లోపలికి ప్రసరించినకొలఁది సన్నమగను నుండును. దీనివలన చెవిపైఁబడుచున్న శబ్దచలనప్రసారము లాకర్షింపఁబడి బలమున హీనతఁజెందక లోపల ప్రవేశించును. అందువలన చెవుడువలనఁ గలుగు కష్టములు కొన్ని తగ్గవచ్చును.

పదునేడవ ప్రకరణము.

“హా దైవమా! నన్నింత దిక్కుమాలినదానిఁగ నేలచేసితివి? పవిత్రమగు క్షత్రియు, గౌరవము గలిగినట్టియు రాజపుత్రవంశమునఁ బుట్టి తుదకు నిర్భాగ్యురాలనై శివప్రసాదు వంచను గొన్నినాళ్లును, జంద్రసేనునియొద్దను గొన్నినాళ్లును, వసియించి మహమ్మదీయుల బారిఁబడుచున్నాను నాకేల మరణముఁ గలుగఁజేయవు? హా! తాతా! ఎందున్నావు? అయ్యో! తల్లీ! నా బాల్యమునందె నీవు మృతినొందుటచేతఁగద నాకిట్టి యవస్థ సంభవించినది! కడుపులోనున్న దుఃఖమునెల్లఁ దెలుపుకొందమన్న నిరుపార్శ్వములఁ బంధువులైన లేరు నేనేమిచేయుదును? మరణమె నాకు శరణమగుఁగాక! బలవంతముగఁ జక్రవర్తిచే నవమానింపఁబడుటకంటె మర్యాదగ మృతినొందుట మేలుగద.” అని తనలోఁ దా ననుకొనుచున్న హేమలతవద్దకుఁ జంద్రసేనుఁడువచ్చి యామె గౌరవమును గాపాడలేకుండినందులకు విచారించుచు “అమ్మా! ఈదినమున నిన్నుఁ దప్పక తీసికొనిరావలసినదని చక్రవర్తి మరల నాకు వర్తమానమునంపినాఁడు. ఈమాట నీతోఁ జెప్పఁజాలక నేను సందేహించుచున్నాను. ఏమిచేయుటకునుఁ దోచదు. అయినను నాప్రాణముల నీనిమిత్తము పోఁగొట్టుకొందును నా మరణానంతరమునఁగాని నీకుఁ బరాభవము సంభవింపదు భయపడకుము” అని పలుక హేమలత యామాటలు విని “నానిమిత్తము మీరు మృతినొందవలదు. నాకవమానము ఘటిల్లినపక్షమున నాచేతనున్న వజ్రమును నూరుకొని త్రాగుటకు సిద్ధముగనున్నాను. నావజ్రపుటుంగరమె నాయవమానమును బాపనోపును ఆచెఱలో నీవఱకు మృతినొందియున్న మాతాతను సత్వరమె నేనుఁ గలిసికొందును” అని యాత్మహత్యకు సిద్ధముగ నున్న సుందరాంగికిఁ బ్రత్యుత్తర మీయఁజాలక “మరల నొకపర్యాయము నీవిషయమై ప్రయత్నించెద” నని చంద్రసేనుఁడు కన్నీళ్లతో వెడలిపోయెను హేమలత ప్రతిక్షణమునుఁ దనకొఱకుఁ బల్లకివచ్చునని యెంచుచు మృత్యుదేవత రాక కెదురుచూచుచుండెను

ఆదిన ముదయమైనది మొదలు రహిమానుఖాను మదనసింగును దదముట్టించు మహోత్సవము గలుగునని మహానందముతో నుండెను హేమలత తన సంయోగమునకు సమ్మతింపనందున నామెపైఁ గసిఁదీర్చుకొనఁదలంచి చక్రవర్తి కామె నెఱింగించెను ఆ కారణముచే నతఁడు రెండురెట్లు సంతోషముగ నుండెననుటకు సందేహము లేదు జాము ప్రొద్దెక్కినతరువాత మదనసింగును బూర్వోక్తప్రకారముగ వధింపవలసినదని

చక్రవర్తివద్దనుండి ఖానున కుత్తరువువచ్చెను వెంటనే ఖాను మిగుల నెఱ్ఱఁగఁగాలిన యినుపకఱ్ఱలనుఁ బట్టించుకొని యిరువురు సేవకులతో మదనసింగు వసించు గుడారమునకుఁబోయి మదనసింగును జూచి మరణమునకు సిద్ధముగనుండుమని చెప్పిన ఖానుతో నతఁడు దనకు మృత్యువు తృణప్రాయమనియుఁ దాను సిద్ధముగ నుంటిననియు ధైర్య గాంభీర్యములతోఁ బలికెను. అంతట ఖాను కోపమునఁ బండ్లు పటపటఁ గొఱుకుచు నినుపకఱ్ఱలను మదనసింగు కన్నులపైఁబెట్టి కాల్పుఁడని సేవకులకానతిచ్చెను. సేవకులును నరహత్యలయందారితేరినవారగుటచే యజమానునియాజ్ఞ తత్క్షణమే శిరసావహించి కాలిన యినుపకఱ్ఱలనెత్తి పట్టుకొని మదనసింగు సమీపమునకరిగిరి వెంటనే నందుఁడు సింగును వెనుకకుఁ బడఁద్రోయఁ దత్క్షణమె యిరువురు సేవకులు మదనసింగు రెండు చేతుల నొకత్రాట విఱిచికట్టి పాదముల బొటనవ్రేళ్లనుఁగూడ బంధించిరి అప్పుడు మదనసింగు మనస్సున నీశ్వరధ్యానమొనర్చుచుండెను "ఇపుడైనఁ జక్రవర్తిమాట విందువేని నిన్ను రక్షించెదను. అట్లుచేసెదవా?" యని రహిమానుఖానడుగ నిర్భయముగ నతఁడు "నేనట్లుచేయను నీయిష్టమువచ్చినట్లు చేయుము" అని యుత్తరమిచ్చెను అపుడు వారినుపకఱ్ఱలను గనులదగ్గఱకుఁ దెచ్చునప్పటికి వెనుకనుండి యొకసేవకుఁడఱచుచువచ్చి "నిలువుఁడు నిలువుఁడు చంపవద్ద"ని కేకవేసెను. ఆమాటలు విని రహిమానుఖాను తిరిగిచూచి యామనుష్యుఁడెవ్వఁడని యరయుచుండ నతఁడు సాహెబుతో వధ నాపవలసినదనియుఁ జక్రవర్తి ఖానును రమ్మనెననియుఁ జెప్పెను ఆ ఘోరకృత్యము నాపి ఖాను మదనసింగు బంధములను విప్పించి చక్రవర్తి గుడారమున కరిగెను. చక్రవర్తియెదుట రసపుత్రుఁడొకఁడు కూర్చుండెను ఖానునుజూచిన తోడనె చక్రవర్తి రసపుత్రునివంకఁ దిరిగి రాయబారమును విశదీకరింపుమని కోరెను రాయబారములు నడుపుటయందు మిగుల నేర్పుగల దుర్గసింగు చక్రవర్తితో నిట్లనియెను. "అయ్యా! మా రాణాయును శ్రీపద్మినీదేవియు విన్నవింపుమన్న సంగతులను నేను మీతో మనవిచేయుచున్నాను భీమసింగుగారిని మదనసింగును దమరు చెఱనుండి విడిపింతురేని పద్మినీదేవి తమకు భార్యయైయుండునట్లొప్పుకొనినది. భర్త ప్రాణరక్షణమునకుఁ దనకాయమునైన నర్పింపఁదలఁచి పద్మిని మీ సాంగత్యమునకు సమ్మతించినది" అని దుర్గసింగు విన్నవింపఁ జక్రవర్తి యమితానందపరవశుఁడై యఱచి, పీఠమునుండి లేచి రహిమానుఖానును గౌఁగిలించుకొని దుర్గసింగును మెచ్చుకొనెను అంతట దుర్గసింగు మరల "ఆ పద్మినితోఁగూడ మా నగరమునందుఁగల గొప్ప స్త్రీలందఱు నిటకువచ్చి సాగనంపెదరు. వారేడువందలకంటె నెక్కువగనున్నారు

అందఱుఁ బల్లకులలోనెక్కి వత్తురు వారు ఘోషాస్త్రీలు కాఁబట్టి వారికిఁ బ్రత్యేకముగ నొక గుడారము మహమ్మదీయుల దృష్టిఁబడకుండ మీరు జాగ్రత్తపెట్టవలెను.” అనవుడుఁ జక్రవర్తి “సందేహమెందుకు? మిగుల జాగ్రత్తపెట్టెదను త్వరగా రమ్మను త్వరగా రమ్మను పో. పో” యని కేకలువేయసాగెను ఇట్లుచెప్పి దుర్గసింగు చక్రవర్తిని వీడుకొనిపోవునపుడు చక్రవర్తి రసపుత్రునకుఁ దనకంఠమునను్న రత్నముల హారమును బహుమానముగ నొసఁగెను ఆ రాజపుత్రుఁ డరిగినదిమొదలు చక్రవర్తికిఁ బద్మినిపై ధ్యాన మెక్కువగుటచే నతఁడు తీవ్రమగు మదనాగ్నిపాలయ్యెను ఒకమాఱు సంతోషముచే వెఱ్ఱివానివలె నటించుచు, నొకపర్యాయము సేవకులకు బహుమానము లిచ్చుచు, నొకమాఱు తోఁచక గుఱ్ఱముపైసవారుఁజేయుచు మదనావస్థనొందుచుండెను. పద్మినీప్రముఖులగు రాజపుత్రసుందరు లబలలగుటచే నాయుధపాణులగు భటులను జూచి భయపడుదురని చక్రవర్తి నిరాయుధులై యుండునట్లు సైనికుల కానతిచ్చెను. వారును నాయుధముల వదలి భంగునిషాచేయ హాయిగ నిద్రఁబోవుచుండిరి. మదన పీడితుఁడగు నతనికి నెంతసేపటికిని బ్రొద్దుపోనందునఁ దనఖాజీని రహిమానుఖానును రప్పించి వారితోఁ గొంతసేపు తనకు రాఁబోవు నూతనభార్యనుగూర్చి పరిపరివిధముల ముచ్చటించుచుండెను అట్లు కొంతసేపు ముచ్చటించి తనపెండ్లి నిశ్చయమనియెంచి తాను శయనించు మందిరమును జక్కఁగ నలంకరింప నాజ్ఞాపించి యమూల్య వస్త్రాభరణములను ధరించెను దుర్గసింగు దెచ్చిన రాయబారమును వినుచుండుటచేఁ జక్రవర్తి హేమలతమాట మఱచి మధ్యాహ్నము చంద్రసేనునకు వర్తమానము నంపఁడయ్యెను సాయంకాలమునఁ జంద్రసేనుఁడె ప్రభుదర్శనమునకువచ్చి పద్మినిరాకను జక్రవర్తిముఖమున విని యదియె హేమలతనపాయమునుండి రక్షించుట కదననియెంచి చక్రవర్తితో నిట్లనియె “మహాప్రభూ! హేమలతను దీసికొనివత్తునా? వద్దా? ఆమె తమయొద్దనుండినయెడలఁ దమకొకకష్టము సంభవించును హేమలతయుఁ బద్మినియు సవతులై యుండుటకు మహారాజపత్నియగు పద్మిని యొల్లదు ఆమె యిందుకాగ్రహముఁ దెచ్చుకొని మరలిపోవునేమోయని నాకు భయమగుచున్నది.” అని చంద్రసేనుఁడనఁ జక్రవర్తి హేమలత దన కావశ్యకములేదని వాక్రుచ్చెను వ్యాఘ్రముఖమునుండి బయలువెడలిన కురంగమట్లు చంద్రసేనుఁడు సంతోషించుచుఁ బ్రభువునొద్ద సెలవుఁ గైకొనిపోయి యావార్త హేమలతకును దనభార్యకును దెల్పి వారితోఁగూడ నానంద మొందుచుండెను. సాయంకాలమగుటతోడనె చక్రవర్తి మధురాహారములను భుజించి యభ్యంగనమొనర్చి పద్మినిరాకను నిరీక్షించుచుండెను. వచ్చెడు స్త్రీజనంబునకెల్ల

నొక పెద్దగుడారము వేయఁబడియుండుటచే వారు ఘోషాతో లోపలికరుగుటకు వీలేర్పడెను. ఈ మహాట్టహాసము విని పద్మిని సాహసమునకును, రాజపుత్రుల యవినీతికిని రాజస్థానముయొక్క దురవస్థకును మదనసింగు భీమసింగు లద్భుతపడుచుండిరి. పతివ్రతయగు పద్మిని మ్లేచ్ఛరాజసంభోగమున కియ్యకొనుటకుఁ గారణముండదని చంద్రసేనాదులును, నాజరుజంగును నాలోచించిరి. నాజరుజంగుపైఁ జక్రవర్తికి ఖాను చెప్పెడు మాటలవలనఁ గోపము నానాటి కధికమగుచుండుటచేఁ గనఁబడినచోట మాటలాడుటయును నతఁడు మానెను. నాజరుజంగు మహావిచారముతోఁ దన రాజభక్తిని జూపుసమయ మెపుడువచ్చునాయని దేవునిఁ బ్రార్థించుచుండెను. ఆ సాయంకాలమున సూర్యాస్తమయమైనతరువాతఁ జిత్తూరుకోటలోనుండి యొక్కవరుసగ తురుష్కశిబిరమునకు నేడువందల పల్లకులు రాసాగెను. పల్లకికి నార్వురు బోయీలుండిరి. కోటమొదలు శత్రువుల స్కంధావారము దాఁక నేకపంక్తిగనున్న పల్లకులను మోయు బోయల హుంకారనాదములవలన మహమ్మదీయుల కర్ణపుటములు పగులుచుండెను. శిబిరమున నొకచోట నాలుగుప్రక్కలను దెరలఁగట్టించి చక్రవర్తి స్త్రీల పల్లకులను నాస్థలమునకుఁ దీసికొనిపొండని బోయల కాజ్ఞాపించెను. లోపలకరిగిన మనుష్యులు తురకల కగపడకుండఁ దమ ఘోషా నిలుపుకొనిరి. శత్రుసైన్యము పల్లకులవంకఁ జూచుచు సశ్రద్ధతో నిరాయుధులై యుండిరి. ఆపల్లకులలో బంగరపుఁ బనిచేసిన పల్లకియందుఁ బద్మిని కూర్చుండెనని చక్రవర్తితో బోయలు చెప్పిరి.

పదునెనిమిదవ ప్రకరణము.

పల్లకులెల్ల నియమితప్రదేశమున కరిగినతరువాత వానితోఁగూడవచ్చిన దుర్గసింగు చక్రవర్తియొద్దకుఁ జని యిట్లనియె "అయ్యా! పద్మినీదేవి యింక మీ పట్టపుదేవియగును గాఁబట్టి శాశ్వతవియోగము సంభవించుచుండుటచేఁ దన భర్తతో నొకమాఱు కడసారి మాటలాడఁగోరుచున్నది. అందుచే నొకగడియ సెలవు దయచేయించవలెను" అని పలుకుటయుఁ జక్రవర్తివల్లెయని సెలవొసంగెను. పిమ్మటఁ బద్మిని పల్లకి భీమసింగు గుడారమునకుఁ గొనిపోఁబడ వారిరువురు నొకగడియవఱకును మాటాడుచుండిరి. కామాతురుఁడైన యలాయుద్దీను నిమిషమైనను వియోగమున కోర్వలేక పద్మినితో సత్వరముగా సంభాషింపఁదలఁచియు భీమసింగును విడువక ఢిల్లీనగరమునకుఁ బందిగాఁ గొనిపోవఁదలఁచియు రహిమానుఖానును బిలిచి యా దంపతులను బట్టుకొమ్మని యాన

తిచ్చెను. రహిమానుఖాను నిజసైన్యముతో నచటి కరుగునప్పటికి రాజస్త్రీలుండు
మందిరమునుండి యొకపల్లకి వారికెదురుగ వచ్చెను. పల్లకివెంట నాయుధపాణులగు
రసపుత్రు లనేకులుండి యందున్నవారి రక్షించుచుండిరి. ఎదురుగవచ్చినవారి ప్రయాణ
మును నివారించుటకు మ్లేచ్ఛభటులు ప్రయత్నించిరి కాని రసపుత్రులు నిలువనందున
వారల కిరువురకును సంకులయుద్ధము జరుగసాగెను. అంతలో భీమసింగు పాఱిపోవు
చున్నాఁడని మహాధ్వని యొకటి శిబిరమున వ్యాపింప రహిమానుఖాను మోసమేమో
సంభవించినదని తెలిసికొని ప్రాణభయమగునని యెంచి వడివడి చక్రవర్తియొద్దకుఁ
బరుగెత్తి విచారముతో "ఓస్వామీ! మోసము మోసముజరిగినది" అని పలికెను.
అల్లాయుద్దీ నులికిపడి లేచి యది యెట్టిదని యడుగ ఖాను తొందరతో నిట్లుచెప్పెను.
"మహాప్రభూ! పల్లకులలోఁ గూర్చుండివచ్చినవారు స్త్రీలుకారు. ఒక్కొకపల్లకియం
దొక రసపుత్రశూరుఁడు కూర్చుండెను. పల్లకుల మోయువారందఱు రసపుత్ర సిపా
యిలెగాని బోయలుకారు. వారు బోయలవేషములఁదాల్చి పల్లకులలో నాయుధములఁ
దెచ్చుకొన్నారు. మన సైనికు లశ్రద్ధగనున్నందున మనమీదినమున నోడిపోదుము.
భీమసింగు పల్లకిలోఁ గూర్చుండి కోటకుఁ బాఱిపోవుచున్నాఁడు. నేనాతని నాపఁజాల
నైతిని" అని ఖాను విన్నవించుచుండఁ జక్రవర్తి నిశ్చేష్టితుఁడై కొంతసేపటి కొడ
లెఱిఁగి రాజపుత్రులు త్రవ్విన మహావిపత్సముద్రమునఁబడి తానును దన సైనికులును
మృతినొందవలసివచ్చెనని చింతించి ధైర్యమును దెచ్చుకొని "ఆ హాలాఅల్లీ! హా మహ
మ్మద్! హా హస్సేన్. హుస్సేన్! అరే నాజరుజంగు! అరే, అరే, అల్లా, అల్లా, అల్లా,
అరో పరుగెత్తి భీమసింగును దఱిమిపట్టుకొనిరండు. అరో! పద్మినీ పద్మినీ.
పట్టుకొండు. సిపాయిలులేచి యుద్ధసన్నద్ధులు గండు. ఓయీ యిబ్రహీం, ఓయీ
జహందరు, లెండి లెండి; అరే జోహురుల్లా త్వరపడు" అని యఱవఁజొచ్చెను.
ఈలోన మునుపటిస్థలమున దాఁగియున్న రాజపుత్రశూరులు భట సమేతముగ
నాలుగువేల తొమ్మిదివందలమందియు నొక్కసారి హుమ్మనివచ్చి యశ్రద్ధగనున్న
మ్లేచ్ఛసైన్యమును దాఁకిరి. అతిత్వరితముగలేచి మహమ్మదీయసైనికులు తమతమ
యాయుధముల ధరించి రసపుత్రుల నెదుర్కొన నుభయసైన్యములకును ఘోరయుద్ధము
జరిగెను. ఈ యాకస్మిక మహాయుద్ధములో మహమ్మదీయులు స్వసైన్యపరసైన్య భేద
మెఱుఁగఁజాలక తమవారిని సహిత మాఁచీఁకటిలో పొడుచుకొనసాగిరి. ఈలోన
సురక్షితముగ నగరముఁజేరిన భీమసింగు మూలబలము నెల్లఁ దీసికొని దక్షిణభాగమున
మహమ్మదీయసైన్యమును దాఁకెను. బలపడిన యీసైన్యమునకును మ్లేచ్ఛులకును జరిగిన

మహాయుద్ధము వర్ణనాదుస్సాధ్యమైయుండెను తమ మానప్రాణములకు హానితటస్థించు
నని శిబిరమునందున్న స్త్రీలాక్రందనధ్వనిఁజేయ యుద్ధముమాని కొందఱు సైనికులు
దారపుత్రాదుల సంరక్షణకై వెనుకకుఁ బరుగులిడుచుండిరి కొబ్బరిపుచ్చెలవలె దెబ్బ
దెబ్బకు నెగిరిపడుచున్న మనుష్యుల పుఱ్ఱెలును స్రవించు రక్తముతో నేల గుభాలునఁ
బడు మొండెములునుఁ దళతళ మెఱయు యోధుల యాయుధంబులునుం దక్క మఱి
యేమియునచ్చట గనఁబడుటలేదు రసపుత్రులును మహమ్మదీయులును హతులైన తమ
బంధుమిత్రుల కళేబరములమీఁదనుండి నిర్దయాత్ములై నడచిపోవుచు యుద్ధము నొనర్చు
చుండిరి. పడినవారితోడను, పడుచుండువారితోడను, గాయములచే బాధపడి యేడ్చు
వారితోడను, దేహమును విడుచునెడ నీశ్వరస్మరణముఁ జేయువారితోడను వెన్నిచ్చి
పరుగెత్తువారితోడను యుద్ధభూమి నిండియుండెను ఈమధ్య మహాశూరుఁడగు ప్రతాప
సింగు భీమసింగునువిడిచి చక్రవర్తిని చెరఁబెట్ట నుద్యమించి నాలుగువందల సైనికులను
దోడుకొని యల్లాయుద్దీను గుడారమువైపరిగెను చక్రవర్తిమీఁదికి రాజపుత్రు లరుగుటఁ
జూచి స్వామి ప్రాణరక్షణ మవశ్యము కర్తవ్యమని మహమ్మదీయులెల్ల విడివడి
శావసింగు నాపుటకు వ్యాఘ్రములవలె రోషావేశ పరవశులై చని ప్రతాపసింగునుఁ
దాకిరి ప్రతాపసింగు మధ్యాహ్నసూర్యునివలె దుర్నిరీక్షప్రతాపుఁడై మహమ్మదీయ
భటులకు భీతిగొలుపుచుండెను మహమ్మదీయులు రసపుత్రులమీఁదికి వచ్చుటయుఁ జచ్చు
టయు నేకకాలమున సంభవించెను ఎందఱి తురకలను రసపుత్రులు చంపినను తురకల
సేనయధికమగుటచే మరలయథాప్రకారముగ సైనికులుమూఁకకుఁజనుచుండిరి తుదకుఁ
జీమలపుట్టలవలె మోటతురకలు చుట్టుముట్టుటచే స్వల్పసంఖ్యగల రాజపుత్రులు క్రమ
క్రమముగ క్షీణించిరి. ఏమిచిత్రమోగాని రాజపుత్రసైనికులలో నొక్కఁడైనను
రణరంగము విడిచి పరుగెత్తఁడయ్యె. కంఠమున ప్రాణమున్నంతవఱకును రసపుత్రులు
ఖడ్గములు విడువక యుద్ధముఁజేసిరికాని శత్రువునిచేతికిఁ గత్తి నీయరైరి. ఇట్లు
సైన్యము పలుచపడినందున ప్రతాపసింగు ఖడ్గమును డాలునుబూని ప్రళయకాలమృత్యు
దేవతవలె తురకలపైఁబడి యనేకులను దెగనఱకి నాతని ధాటికివెఱచి ముందటివారు
చెల్లాచెదరై పరుగులిడిరి తరువాత నలువదియోధులతో రణరంగమున నిలిచియున్న
ప్రతాపసింగుపై వెనుకనున్న తురకలు గవిసిపడిరి ప్రతాపసింగు దేహమంతయు
గాయములతో నిండి చిమ్మనగొట్టములనుండివచ్చు వసంతమట్లు గాయములనుండి
రక్తము స్రవించి చుట్టుప్రక్కలనున్నవారిపైఁ బడుచుండెను రక్తక్షయముచే బలక్షయ
మగుటయు, సింగు నడుమనడుమ సొమ్మసిలుచు దెబ్బదెబ్బకు నొకతురకను గూల్చు

చుండెను. ఆవేళఁ బ్రతాపసింగుచే నిహతులైనవారె దాదాపుగ నూఱుమందియుండిరి బలహీనుఁడైయున్న ప్రతాపసింగుమీఁదికి రహిమానుఖాను వడివడివచ్చి తాఁక, సింగు గుఱ్ఱముమీఁదనున్న ఖానును దిగలాగి తన ఖడ్గ మాతనిపై నెత్తెను అప్పుడు మ్లేచ్ఛ సేనాధిపతియగు రహిమానుఖాను ప్రతాపసింగుపాదములపైఁబడి "నేను నీబిడ్డవంటి వాఁడను నన్ను జంపినను మీయింటికుక్కను జంపఁజూచినను నొకటే బాబూ! నాకుఁ బ్రాణదానముఁ జేయుము నాతల్లికి నేనొక్కఁడనే కుమారుఁడను నాకు బిడ్డలుపుట్టిన మీపేరుపెట్టెదను నన్ను వదలిపెట్టు మహాప్రభూ నన్ను వదలిపెట్టిన యెడల మా చక్రవర్తియున్న రహస్యస్థలమును మీకుం జూపెదను ఆతనిని మీరు చంపి మీకసి తీర్చుకొనవచ్చును, కాని నావంటి దిక్కుమాలినవానినిఁ జంపిన నేమిప్రయోజనము?" అని వీరపురుషలక్షణముల విడిచి పరిపరిభంగుల వేఁడికొన జాలిగుండెగల ప్రతాపసింగు వానిని విడిచిపుచ్చెను రహిమాను గండముచుండి బయలువడి మఱి యితరయోధుఁడు కనఁబడకుండఁ గొంతసేపు చచ్చిన యొక యేనుఁగుచాటున దాగుకొని యక్కడనుండి లేచి రాజపుత్రు లెక్కివచ్చిన పల్లకులలో నొకదానియందు రహస్యముగఁ దలదాఁచుకొనెను అదివఱకు చెఱలోనుండిన మదనసింగు మహమ్మదీయుల కలవలముఁ జూచి చక్రవర్తి తన్ను విడిపింపఁడని యెఱిఁగి యాతనిచే మోసపోకముందే మేలుకొని తన గుడారమునుండి వెలివచ్చి రసపుత్రవీరులను గలిసికొనెను భీమసింగు వానినిఁ గనుఁగొని కొంతసైన్య మాతనికిచ్చి ప్రతాపసింగునకు సహాయమొనర్పుమని యంప, నాతఁడును సత్వరముగ చక్రవర్తి గుడారమువంకవచ్చి ప్రాణావశిష్టుఁడై యప్పటికిఁ దన ప్రాణరక్షణమొనర్చుకొనుచున్న పినతండ్రినిఁ జూచెను. మదనసింగు పినతండ్రి యవస్థను గనుఁగొని యతని శరీరమును బరీక్షించునప్పటికిఁ బ్రతాపునిదేహమున ముప్పదిరెండు పెద్దగాయములును నెనిమిది చిన్నగాయములునుండెను మదనసింగు పినతండ్రితో "అయ్యా! మీరు మన శిబిరమున కరుగుఁడు మీరింక యుద్ధమొనర్పలేరు వ్రణవైద్యులచే గాయములకుఁ గట్టుకట్టింపుఁడు' అనిచెప్ప ప్రతాపుఁడు "నాయనా! రణమునుండి యింటికి మరణభయమున నీవఱకు నేనరుగలేదు. నేనింకఁబోఁజాలను. రక్తవర్షముచేఁ దడిసిన యీ మంటిపరుపుపైఁ బండుకొనియెద. నీవు చక్రవర్తిమీఁది కరిగి వానిని బట్టుము. లేకున్న వధింపుము నానిమిత్తమై విచారింపకుము" అనిపలుక మదనసింగు విచారముతోఁ బిన్నతండ్రి ప్రాణముల కాశవదలుకొని చక్రవర్తిమీఁది కరిగెను. చక్రవర్తి యంగరక్షకసైన్యములతో నొక చిన్నగుడారమునుండి సైన్యము పలాయనమగుటకును, రాజపుత్రులుచేసిన యుక్తికిని విచారించుచుఁ బ్రాణసంరక్షణ

మొనర్చుకొనుచుండెను మదనసింగునుజూచి యంగరక్షకులు నిశ్చేష్టితులుగా నతఁడు శత్రుమధ్యమున నుఱికి యాకస్మికముగ సింగపుఁ గొదమవలెఁ జక్రవర్తియెదుట నిలిచి యాయుధపాత్రులోనఁ జక్రవర్తి సమీపముననున్న నాజరుజంగు వారికిరువురకును నడుమవచ్చినిలిచి తన ఖడ్గమును త్రిప్పుచు నాతనిఁ దాఁకెను నాజరుజంగు సమయమునకు రాకుండినఁ జక్రవర్తి యాదినమునఁ బరలోకవాసియైయుండును చక్రవర్తి మదనసింగునుజూచి నిర్విణ్ణుఁడై చేష్టలుదక్కి కదలి పాఱిపోఁజాలఁడయ్యెను అప్పుడు నాజరుజంగు మదనసింగుతో నిట్లనియె. "మిత్రుఁడా! నాటికి నేఁడు నీదర్శనమైనదని నేనూరుకొనను నాప్రాణములుండునంతవఱకును నీవు చక్రవర్తిపై పరుగఁజాలవు అక్కడనే నిలువుము ఒక్కడుగు దాటివచ్చితివా నీప్రాణములు నీకు దక్కవు మాస్వామి ప్రాణరక్షణమునకంటె నారక్షణ మెక్కువ కాదు" అని శౌర్యరసమొలుక రాజభక్తి ప్రపూరములగు మాటలతో మదనసింగును నిలువ నతఁడాశ్చర్యపడి "చక్రవర్తి యదృష్టవంతుఁడగుటచే నీ వాతనికి నేడడ్డమువచ్చినావు నీతో యుద్ధముచేసి గెలిచి చక్రవర్తిని బరిమార్చెదను" అనిపలికి యాతనితో యుద్ధమారంభించెను అట్లిరువురును కొంతసేపు యుద్ధమునుసలిపి యెవ్వరును గెలువనందున విసుగుచుండిరి. అంతలో యుద్ధ మాపివేయుమని భీమసింగుత్తరువుఁజేయ మదనసింగు మరలెను ఆదినమున రాజపుత్రవీరు లనేకులు మృతినొందినను తుదకు మహమ్మదీయులు చెల్లాచెదరై నానాముఖములకుఁ బాఱిపోయిరి ఈనడుమ మన చిదానందయోగి కాగడలను వేయించుకొనివచ్చి నూఱుగురుభటులతో రంగస్థలముఁజొచ్చి తురకల గడ్డములను దివిటీలతోఁ గాల్చుచు వారి వస్త్రములను శరీరములను దహనమొనర్చుచుఁ జిత్రచిత్రముగ వారినిఁ జంపనారంభించెను. మహమ్మదీయు లప్పటికి నిశ్శేషముగ నిర్మూలింపబడిరి సరదారులు చచ్చిన గుఱ్ఱము లొకవైపరుగ యేనుఁగులు మఱియొక వంక కరుగసాగెను. స్త్రీలార్తనాదముతో నటునిటుఁ బరువులిడ మ్లేచ్ఛసైన్యమునఁ గలవలమును, బాధయు నధికమయ్యెను ఎచటఁజూచినఁ బీనుఁగులు, నెచటఁ గనుఁగొన్న రక్తప్రవాహములు, నెందునడిచిన నెముకలు, నేమివిన్న నార్తధ్వనులు, అయ్యెను అట్లున్న రంగస్థలమున మృత్యుదేవత విచ్చలవిడిగ సంచరించుచున్నట్లు మహాభయంకరమైయుండెను రాత్రి రెండుజాములకు సైనికులు శిబిరమునువిడిచి పాఱిరి. రసపుత్రులు తెల్లవాఱువఱకు నుండిరి

ఇరువదొకటవ ప్రకరణము.

సుల్తాను కోటఁ జేరఁగనే ఫకీరులను మహమ్మదీయులను రావించి మసీదులందు దైవప్రార్థనలు చేయ నియమించెను. బ్రాహ్మణులను బిలిపించి తనకు జయము కలుగుటకై రంగనాయకుని యాలయమునందు నింకఁ దక్కిన దేవళములందును పూజలు నభిషేకములు జపములు నుత్సవములును జేయుండని యాజ్ఞాపించెను. చెఱసాలయందున్న హిందువులను మాత్రము విముక్తులం జేసెను. సేనానాయకులను బిలిపించి కోటయందలి యాయా తావులను ద్వారములను మిక్కిలి జాగరూకతతోఁ గాచికొనియుండుఁడని యుత్తరువు చేసెను. భటులకందఱికి మందుగుండు మొదలగు సామగ్రిని బంచిపెట్టించి సిద్ధపఱిచెను. కోట బురుజులమీఁది పిరంగులయందు మందుగట్టింపించి యుంచెను.

అక్కడ శత్రుసైన్యము లావఱికే మైసూరురాజ్యమునందలి మిట్టప్రదేశములను జయించుట బెంగుళూరును బట్టుకొనుట మొదలగు జయములచే మిన్నుమన్ను నెఱుంగక యుద్రేకించుచుండెను. వీరావేశముచే నాంగ్లేయవాహిని మిన్నుముట్టి యుప్పొంగుచుండెను. ఏ నిమిషముననో వచ్చి శ్రీరంగపట్టణపుకోటను నాశనము చేసి టీపుసుల్తాను ప్రభుత్వము నతిత్వరితముగ రూపుమాపవలయునని సైనికులను కొదమ సింగంబులుఱుకుచుండిరి. అట్టిసమయమున నాహా! దైవగతి చిత్రము! సేనలయం దద్భుతమైన రోగములు ప్రవేశించెను. విషజ్వరములు తఱుచయ్యెను. వాంతిభేది యొకమూల నారంభించి ముసుముపట్టి వరుసలువరుసలుగా భటులను రాల్చుకొనిపోవుచుండెను. దీనికిఁదోడు కాటకపుబాధ యొకటి. ఆహారవస్తువులు సరిపోయినవి. దినమున కిన్నూర్లు మున్నూరుమంది శత్రువుల గుండుదెబ్బలు లేకయే యనాయాసముగాఁ బడిపోవుచుండ మిగిలినవారి కింత యన్నమైనను గడుపునిండ లేకపోయెను. మనుష్యులకుఁ దోడు గుఱ్ఱములును పిరంగులీడ్చు నెద్దులునుగూడ నాఁకట మలమలమాడుచుండెను. గుఱ్ఱములసంఖ్య సగమయ్యెను. ఎద్దులసంఖ్య యత్యల్పమయ్యెను. ఇఁక నేమిచేయవలయును? ఈసైన్యమున కంతటికి నధిపతియగు కారన్వాలీసను నాంగ్లేయప్రభువు మిక్కిలి వివేకిగావున మంచియాలోచనచేసి యాయుధములను పిరంగులను దక్కిన సామగ్రి నచ్చటనే డించి హతశేషులతోఁ గూడి మరలుకొని వచ్చి క్షేమముగఁ జెన్నపట్టణమునఁ బ్రవేశించెను. ఒక్కతుపాకి కాల్పకయే యొక్క కత్తినెత్తకయే తాను కోటవిడిచి రాకయే యనాయాసముగ శత్రువులు పలాయితులైనందు కక్కడ సుల్తానతిసంతోషము నొందెను. సుందరునితో మైత్రి ప్రబలెను. సమయము చిక్కినప్పుడెల్ల సుందరుఁడు సుల్తానునకు హితోపదేశము చేయుచుండెను.

ఇట్లు సుల్తాను సుందరుఁడు నేకమగుట తక్కిన ఫకీరుల కోర్కెలేమిని బుట్టించెను ఆ ఫకీరులు సుల్తానునొద్దకుఁ బోవుటకే సాహసింపరైరి "సమ్ముఖమ్మునకుఁ బోయినయెడల మనచేయు దౌర్జన్యమును గన్నులార చూచినందున సుల్తాను మనలనే శిక్షించును ఊరకుండినయెడల సుల్తానుబుద్ధి మతాభిమానమునుండి తప్పిపోవుచున్నది ఏమిసాధనము?" అని చింతించుచుండ నొకసంవత్సరము గడచెను. అట్టిసమయమునఁ గాబూలునుండి యొక గొప్ప మహమ్మదీయసన్యాసివచ్చి పట్టణమునకు వెలుపలి కావేరీతీరమందలి యొక తోఁటలో విడిసి సుల్తానునకుఁ దనరాక యెఱిఁగింప నొక దూత నంపెను అదివిని ఫకీరులందఱును మిక్కిలి సంతసించి యాతనిమూలమునఁ దమ యుద్యమము సఫలమగునని యెంచి సుల్తానుకంటె ముందుగ బయలుదేఱిపోయి కాబూలు ఫకీరును యథావిధిగ దర్శించి తగినరీతిం బూజించి తాము నాదరింపఁబడి సమీపమునఁ గూర్చుండిరి అప్పుడు వారి కిట్టి సంభాషణము జరిగెను

కాబూల్ ఫకీరు — మీ సుల్తాను గొప్పపండితుఁడును యోగ్యుఁడునని వినుచున్నాను మిక్కిలి సంతోషము

ఒకఫకీరు— అదియంతయుఁ బూర్వకాలపుముచ్చట యైపోయినది.

కా- ఫ— ఏమేమి? ఇప్పుడదంతయు లేదాయేమి?

ఒకఫ— ఇప్పుడా? చాలకాలమునుండి లేదు

కా- ఫ—లక్షలకొలఁది మనుష్యులను మనమతమునందుఁ జేర్చినాఁడనివింటిమే!

ఒకఫ — అవును మొదట నంతపనిచేసినవాఁడే ఇప్పుడొకహిందువు ఫకీరు వేషముతోవచ్చి దర్బారునందుఁ బ్రవేశించి సుల్తానుబుద్ధిని పాడుచేసినాఁడు ఇంకను పాడుచేయుచున్నాఁడు

కా-ఫ—ఏమి! ఆశ్చర్యము! ఆశ్చర్యము! ఒకకాఫరువచ్చి యింతపనిచేసెనా? సుల్తాను వివేక మేయేటఁ గలిసినది?

ఒకఫ— సుల్తాను వివేక మేటఁగలియకపోయినయెడల నింతేసని యేలపుట్టును?

కా- ఫ— ఆఁ? ఏమయ్యా ఒకకాఫరు తనయొద్దకువచ్చి—

ఒకఫ— అయిననొక్కటి అతఁడు కాఫరని సుల్తానెఱుఁగఁడు.

కా- ఫ—ఎఱిఁగిన మీరుమాత్ర మేమిచేసినారు? సుల్తానుకు బుద్ధిచెప్పరాదా?

ఒకఫ—మమేమిచేయఁగలము? సుల్తానుముఖము చలాచుటకే మాకు భయము.

కా-ఫ — అయ్యయ్యో! ఈ పాడుసుల్తా నిట్టివాఁడయ్యెనా? ఫకీరుల నాదరించుటయే సున్నచుట్టెనా? నేరక నేనిచ్చటికి వచ్చితి

ఒకఫ— తమ్ము నాదరింపకపోఁడు తాము విచారపడ నక్కఱలేదు. మేమే

యాతని సమ్ముఖమునకుఁ బోఁజాలము కాని—

కా-ఫ— ఏమి? ఏల పోఁజాలరు?

(ఫకీరులందఱు నొకరిముఖము లొకరు చూచుకొనుచు, చెప్పుదమా? మానుదమా? యని తడఁబడసాగిరి)

కా-ఫ—ఏల సంశయించెదరు? మీరెద్దియైన నపరాధము చేసినారా? చేసినను నవాబు క్షమింపవలసినదే భయములేదు. నాతోఁ జెప్పుఁడు.

ఒకఫ— ఒకనాఁడు మేమందఱు మా హిందువునుబట్టి చంపఁబోవుచుండ సుల్తానత్యుగ్రుఁడై వచ్చి యాతని విడిపించి తోడ్కొనిపోయెను దైవము రక్షించి మమ్ముఁ జంపక విడిచిపెట్టెను. అప్పటినుండి మేము సుల్తానును—

కా-ఫ—ఓహో! కారణమిదియా? ఏమో పెద్దనేరము చేసితి రనుకొనుచున్నాను. మీరు మతాభిమానులును శిష్టాచారగరిష్ఠులుగా నున మంచి సత్కార్యమే చేయఁబూనినారు.

కా-ఫ— ఈరాజ్యమునందు మతమునకు దుర్దినములు వచ్చినవి. ఈదినములే కాఫరులకు పండుగుదినములైనవి.

ఒకఫ— అయ్యో! ఏమిచెప్పుదును? మనసుల్తాను వాంధ్ర దేవాలయములందే యుత్సవములు చేయించుట కారంభించినాఁడు (పెద్ద నిట్టూర్పుపుచ్చి) మేరే అల్లా! మేరేఅల్లా! పవిత్రమైన మతనిబంధనము లగ్గిపాలయిపోయినవి శిష్టాచారములు భ్రష్టైపోయినవి

మఱియొకఫకీరు (వెనుకకుఁ దిరిగిచూచి)—అదిగో సుల్తాను వచ్చుచున్నాఁడు. ఇఁక మేమిచ్చటనుండ జాలము మా కనుజ్ఞయిండు

కా-ఫ— (ఉలికిపడి) మీకేమిభయము? మీప్రాణములకు నాప్రాణములడ్డు. భయపడవలదు సుల్తాను రావేగమే మూడుమాటలతో నాతనిబుద్ధిని మనవైపు త్రిప్పివేసెదను చూడుఁడు

(అంతట సుల్తాను తగిన పరివారముతో వచ్చి కాబూలుఫకీరును దర్శించి యతి వినయముతో సలాముచేసెను)

కా-ఫ— (సలామందికొనక) సుల్తాన్! (పరుషముగ) నీవు గొప్పపండితుఁడవనియు పండితుల నాదరించెదవనియు పూర్వాచార పారీణుఁడవనియు మతాభిమానివనియు నా స్వదేశమగు కాబూలునందున్న యప్పుడే విని నిన్నును నీవు క్రొత్తగా మతమునందుఁ జేర్చిన లక్షలకొలఁదియున్న పెలవారినిఁ జూడ వేడుకపడి పుట్టెడాసతో వచ్చితిని వచ్చినందుకు మంచివార్త వింటిని! చాలు. చాలు.

సు— (ఆశ్చర్యముతో) ఏమి నేనేమియుఁ జేయలేదే!

కా-ఫ — నీవొక కాఫరును దగ్గఱఁబెట్టుకొని వాఁడుచెప్పినదెల్ల వినుచు మతమును పాడుచేయుచున్నావఁట!

సు — కాఫరునా? (తక్కిన ఫకీరులనుజూచి) నేనా? ఏమిచిత్రము!

కా-ఫ — నీయొద్ద నొక కాఫరులేఁడా? నిజము చెప్పుము

సు — నా దివాను బ్రాహ్మణుఁడు ఉద్యోగస్థులు తగినవారుండనియెడల రాజకార్యములెట్లు —

కా-ఫ — ఉద్యోగస్థుల మాట యటుండనిమ్ము ఒక హిందువు ఫకీరువేషముతో వచ్చి నీయొద్దనున్నవాఁడు కాఁడా?

సు — (కొంతయోచించి తక్కిన ఫకీరులతో) హిందువెవఁడు? పంజాబునుండి వచ్చిన ఫకీరా?

ఒకఫ — అవును వాఁడు మహమ్మదీయుఁడు కాఁడు హిందువు

సు — నేను నమ్మను (కాబూలుఫకీరుతో) హజరత్! వీరు తప్పభిప్రాయ పడుచున్నారు. ఆతనియందు వీరికి విరోధము ఒకనాఁడాతని వీరందఱు పట్టి చంప—

కా-ఫ — చంపవలెను అవును చంపవలెను మనమతమునందుఁ జేరమను వారినే పట్టి సంహరింపవలయునని మనశాస్త్రములు ఘోషించుచున్నవి. ఇక కపట వేషముతో వచ్చి మతమును పాడుచేయువాఁడెవఁడు దిక్కేమి? అట్టివారిని కండ కండలుకోసి చీల్చి రక్తమును బాఱించవలయును.

సు — అతఁడు హిందువు కాఁడే?

ఒకఫ — మహాప్రభూ! వాఁడు హిందువే హిందువే నాఁడు మేమందఱము వాఁడు స్నానము చేయుట హిందువులవలెనే యేమేమో చేయుట ముమ్మాఱు కొంచెము కొంచెము నీరెత్తి త్రాగుట చెంపలువాయించుకొనుట నెత్తిగొట్టుకొనుట ముక్కుఁ బట్టుకొనుట దోసిటనీరెత్తిపలుమాఱు విడుచుట మొదలగు చేష్టలన్నియుఁ బరిశీలించినాము

కా-ఫ — చూచితివా? ఛీ! నీవంటి దుష్టుని యింటికి మావంటి శిష్టులు రారాదు. మేమిఁక పురమునకు రాము ఇక్కడినుండి యిట్లే పోయెదము

సు — (తనలో) అయ్యో! కాబూలువఱకు వ్యాపించిన నాకీర్తి వినివచ్చిన యీ మహానుభావుఁడు మరలిపోయినయెడల దుర్యశము పాలవుదునుగదా! (ప్రకాశముగ) హాఁ! హాఁ! అట్లు సెలవియ్యవలదు. వాఁడు మనచేతులయందే చిక్కియున్నాఁడు వంటయింటికివచ్చిన కుందే లెటుపోఁగలదు? నిశ్చయముగ వాఁడు హిందువే యైనయెడల తమయెదుటనే పొడిపించివేసెదను మతాభిమానముగలిగి ప్రవర్తించుచున్న నన్నపకీర్తికి లోనుజేసి మీరు వెడలిపోవుట ధర్మము కాదు. నిష్కారణ మేల కోపగించు

కొఁడెవరు? దయచేయుఁడు కోటకు విచ్చేయుఁడు నన్ను సంతుష్టాంతరంగునిఁగఁ జేయుఁడు.

కా-ఫ — ఆ హిందువును వీరందఱు చూచుచుండ నతికించెదనని తప్పక వాగ్దానము చేసినయెడల వచ్చెదను

సు — అట్లే చేసెదను. వానిని మీకొప్పగించెదను. మీరు నీ తక్కిన ఫకీరులను చిత్తమువచ్చినట్లు చేయుఁడు ఇంతమట్టుకు సమ్మతించితిఁగావున నాయభిప్రాయ మొక్కటికలదు అదిమాత్రము తాము తీర్చవలయును.

కా-ఫ — ఏమి మీ యభిప్రాయము?

సు — మఱేమియులేదు అతఁడొక పరమసాత్వికుఁడగు ఫకీరనియు నామేలు కోరినవాఁడనియు నాకుఁ దోఁచుచున్నది కావున దయచేసి వానిఁ జూడఁగనే చంపక కొంత మతవిషయమైన చర్చ చేసిచూచి హిందువని నిశ్చయము తెలిసినతరువాత మీయిష్టమువచ్చినట్లు చేయుఁడు

కా-ఫ — (కొంత యోచించి) సరి అట్లే చేయుదము పద

ఈమాటలు తక్కిన ఫకీరుల కర్ణముల కతి సుఖావహములై యమృతధారలవలె తోఁచెను "సరి. ఇఁక నాదుర్మార్గుని మరణము నిశ్చయము" అని యెంచి యుప్పొంగుచుండిరి సుల్తాను ఫకీరును సపరివారముగను దక్కిన ఫకీరులతోడను దోడ్కొనిపోయి తనకోటయందొక రమ్యహర్మ్యమున విడియించి యాతనిఁ బహుతెఱఁగులఁ బూజించెను

ఇఱువదిరెండవ ప్రకరణము.

ఆరాత్రి ఫకీరులకందఱకును గొప్ప విందు జరిగెను అందఱును భోజనములయిన తరువాత నొక విశాలమైన మంటపమునఁ గూర్చుండిరి. కాబూలుఫకీరు పంజాబుఫకీరును వేగముగఁ బిలిపింపుమని సుల్తానును తొందరపెట్టెను సుల్తాను పంపించిన వర్తమానము విని సుందరుఁ డతివేగమున బయలుదేరివచ్చి యా మంటపమునఁ బ్రవేశించి విధివిధానముచొప్పున కాబూలు ఫకీరునకు సలాముచేసి సుల్తాను నియమించిన తావునఁ గూర్చుండి తక్కిన ఫకీరులు మీసములు గీటుచు గడ్డములు దువ్వుచు సకిలించుచు నొండొరుల ముఖములుచూచి నవ్వుకొనుచు నుత్సుకులై యుండుట కనిపెట్టి నేఁడేదియో యుపద్రవమున్నదని యూహించి యిదివఱకు సంభవించిన కష్టములనుండి యెట్లు గట్టెక్కించితివో నేఁడు నట్లే కాపాడుమని తన యిష్టదైవతమును బ్రార్థించుచు నూరకుండెను. అప్పుడు వారి కిట్టి సంవాదము జరిగెను.

ఒకఫ—(సుందరుని జూచి) ఏమండీ? మీరు మహమ్మదీయులై యుండి అందును ఫకీరులై యుండి మన మతముమీఁద నింత విశ్వాసము లేకపోవుటకు కారణమేమి?

సుం—నాకు మహమ్మదీయమతమునందు విశ్వాసము లేదని యెవరు చెప్పినారు?

ఒకఫ— ఎవ్వరును జెప్ప నేల? మీరు రచించిన నాటకమే చెప్పుచున్నది

సుం— ఆ నాటకమునందు మహమ్మదీయమతము మంచిది కాదని యేమైనను జెప్పఁబడియున్నదా?

ఒకఫ— ప్రత్యక్షముగా నట్లు చెప్పవలెనా?

కా-ఫ — నాటకమేమి! ఏమి నాటకము?

ఒకఫ— ఈయన మన మతమును దూషించుచు నొకనాటకమును వ్రాసి బాలురచేత నాడించినారు.

కా-ఫ— ఆఁ హాఁ సుల్తాన్! ఇంకను వీనిని విశ్వసించుచునే యున్నావా?

సు—లేదు లేదు ఆనాటకమునందు మనమతము మంచిది కాదని యేమియుఁ జెప్పియుండలేదు

ఒకఫ— (తనలో) కాబూల్ ఫకీరుగారు మనకుండనే యున్నారు మనకు వచ్చిన భయమేమి? (ప్రకాశముగ) ప్రత్యక్షముగ మన మతమును దూషించలేదుగాని పూర్వ మెవఁడో యక్బరని యొకఁడున్నయట్లును, అతఁడు హిందువుల నాదరించినట్లును, వారివలననే యష్టైశ్వర్యములు పొందినట్లును ఏమేమో వచింపరాని మాటలన్నియు—

కా-ఫ— ఓహో! చాలును. చాలును అసలు మహమ్మదీయులయొద్ద నిట్టి కారుమాటలు కూయనిచ్చినవారి ననవలెను ఆయక్బరొక మతద్రోహి అతనికి హిందువులవలన నైశ్వర్యము కలుగుట కేవల మనృతము (సుందరునిజూచి) ఓరి ద్రోహి! పాపి! మతాభిమాన మించుకైన వలదా?

సుం—మతాభిమానమనఁగా హిందువులలో బట్టువానివలె నూరక పొగడుచుండుటా?

కా-ఫ— పొగడుటమాత్రమే కాదు అన్యమతములను ఖండించి సాధ్యమైనంత మట్టుకు తనమతమును వ్యాపింపఁజేయుటే మతాభిమానము. అట్లు చేయువాఁడే మతాభిమాని

సుం— మతమునందలి చెడ్డవాడుకలను సైతము భూషించుచుండవలెనా?

కా-ఫ — చెడ్డ వాడుకలా! శిష్టాచారములు చెడ్డవాడుకలుగాఁ దోఁచుచున్నవిరా నీకు? ఓరి! దుర్మార్గుఁడా!

సుం— శిష్టాచారము లెట్టివై యుండవలెను? ఎట్టి యాచారములను మన మవలంబింపవలయును?

కా-ఫ— బహిరంగముగ నెల్లవారిని బలవంతముగ మన మతమునందుఁజేర్చుట యొకటి, అట్లుచేరనివాని తల నెగరఁగొట్టుట యొకటి, ఇవన్నియు శిష్టాచారములు. ఈ యాచారముల నవలంబించువాఁడు శిష్టుఁడు సమ్మతింపనివాఁడు భ్రష్టుఁడు.

సుం— శిష్టాచారములైనయెడలసరి అవి లోకములను ముంచివేయునవి యైనను సరియేకదా?

కా-ఫ— లోకముల నేల ముంచివేయునురా మూర్ఖా! ఇందుకేనా మన పెద్దలుచేసిన యేర్పాటు? జను లన్యమతములందుఁ జేరి చెడిపోకుండునట్లును ఎల్లరకు నిహపరసౌఖ్యములు కలిగియుండునట్లును మనముచేసెడు నీకార్యములు ఉపకారములుకాని యపకారములు కావు

సుం— ప్రతిమతములోనివారును నన్యమతస్థులు కేవల పతితులనియే యెంచుచున్నారు అందేమతము శ్రేష్ఠతమము?

కా-ఫ— లోకమునందలి మతములన్నిటియందును మనమత ముత్తమము. దీనినిమించినమతములేదు

సుం— ఎవరిమతమును వారట్లే పొగడుకొందురు

కా-ఫ— ఈపతితుఁ డన్యమతములకుచు సామము వెట్టుచున్నాఁడు మన మతస్థాపకుఁడగు వరప్రసాది నొక్కమారైనను పేర్కొనఁడు. వీనిధోరణిచూడ మహమ్మదీయుఁడుకాఁడని తోఁచెడిని

ఒకఫ— ఇంకను మహమ్మదీయుఁడే యనుకొనుచున్నారా? వీఁడు హిందూ బ్రాహ్మణుఁడు బ్రాహ్మణుఁడు

కా-ఫ— నీవు నిజముచెప్పుము. నీవు మహమ్మదీయుడవా?

సుం— (తనలో) నాప్రాణములమీఁదికి వచ్చినది ఈశ్వరా! ఏమిగతి! (అని చింతించుచు నూరకుండెను)

సు— (తనలో) అయ్యో! హిందువైనయెడల నిష్కారణ మింతటి బుద్ధిమంతుని సంహరింతురే! ఏమిసాధనము! (ప్రకాశముగ) హిందువుకాఁడు. ముసల్మానే

మఱియొకఫకీరు— ముసల్మానైనయెడల మనతోఁగూడి యేల భుజింపఁడు?

సు— మక్కాయాత్రకొఱకు దీక్షవహించియున్నాఁడు

ఇంకొకఫకీరు — కాదు మహాప్రభూ! ఇతఁడు పూర్ణయ్యపంతులుగారియింట నిత్యమును భుజించుచునేయున్నాఁడు నిశ్చయముగ వీఁడు బ్రాహ్మణుఁడు కావలసిన

యెడల పరీక్షింపుఁడు కాడయందు నూలిపోఁగులుండును

కా-ఫ— ఏది? ఆతని యంగీ యూడదీయుము. చూతము

అనునప్పటి కొకభకీరులేచి సుందరుని నిలువుటంగి బలవంతముగఁ దీసివేసి యజ్ఞోపవీతమును జేతఁబట్టి మీఁదికెత్తి సభవారికిఁ జూపెను

సు—ఓరి దుర్మార్గుఁడా! ఎంతకాలము నన్ను మోసపుచ్చి తిరిగితివి!

కా-ఫ— హుం. చూచెదరేమి?

ఇద్దఱు భటులు సుందరుని బట్టుకొని విఱిచికట్టిరి సుందరుని కిఁక నెవ్వరు దిక్కు? పూర్వము సుల్తాను విడిపించెను ఇప్పుడు సుల్తానుండియుఁ బ్రయోజనము లేదయ్యెను అట్టిసమయమునందు పూర్ణయ్యపంతులుగారతిత్వరితముగఁ బరుగెత్తివచ్చి రోఁజుచు గద్గదస్వరముతో నిట్లనియె

పూర్ణ— మహాప్రభూ! తామెప్పుడును మతవిషయమైన దురభిమానములో మునిఁగియుందురు కాని రాజ్యమునకువచ్చు నుపద్రవముచు జూడకయున్నారు. (సుందరునివంకఁ జూచి) ఓహో ఈతనిపనియైనదా? పాప మీ చిన్నవానికీపాట్లు తప్పక యెప్పటికైన వచ్చునని నేననుకొనుచునేయున్నాను సరి అవతల కారన్వాలీసు మరల సైన్యములను దీసికొనివచ్చెను కోట భద్రము ఇదిగో! చారులువచ్చియున్నారు. చిత్తగింపుఁడు.

సు— (ఉలికిపడి) హాఁ! కారన్వాలీసా? ఎంతసైన్యముతో వచ్చినాఁడు? ఏంతదూరమున నున్నాఁడు?

చారులు— మహాప్రభూ! రెండుమూడుమైళ్లదూరములో నున్నారు. ఆంగ్లేయుల పటాలములును నిజాముదండును మహారాష్ట్రసైన్యములును జేరి సుమారు ముప్పదివేవురుందురు

సు— ఆహా! ఇప్పుడు చాలరాత్రియైనది, ఏమిచేయుదు?

అని కొంతవడిదనుక యాలోచించుచుండెను ఆసమయము చూచి పూర్ణయ్యగారు సుందరుని విడిపించి పంపించివేసెను సుల్తాను చేయఁగల ప్రయత్నములు చేసెను గాని తెల్లవాఱునప్పటికి శత్రుసైన్యసాగరము పొంగి పొరలివచ్చి పురము ముంచివేసెను సుల్తాను కఠిననిబంధనల కొడంబడి యొడంబడికచేసికొనవలసివచ్చెను. అది యొడంబడిక కాదు అనాయాసముగ నోడిపోవుటని చెప్పవచ్చును సగము రాజ్యము విశేషధనమునుగూడ నచ్చుకొనెను అది తీరువఱకుఁ దన ముద్దుబిడ్డలను తాకట్టుగనిచ్చెను ఇఁక చెఱనున్న యాంగ్లేయులను విడుచుట చెప్పనేల?

చ. మనము సమస్తభూవరసమాజము సేనలతోడఁ గూడి రాఁ
బనుపుద మంత నాథగణిపాలురు వచ్చిన సైన్యరాజితోఁ
గినుకదలిర్ప ద్వారవతికిం జని దాడులువెట్టి యా చతు
ర్ధనుని భయంబుఁ బాపుదము దానవసంహరుఁ బాఱఁదోలుచున్ ౨౭.

వ. నావుడు నా దుష్టచతుష్టయంబు నాలోకించి యుధిష్ఠిరుం డిట్లనియె మనము సకల రాజన్యుల రావించి శ్రీకృష్ణునిఁ దలఁపుఁ దెలియ నొక్క దూతం బంపి యక్కార్యంబుఁ దెలిసి చేయవలయు చందంబునఁ జేయుదము గాంగేయుం డిబ్భంగి నిశ్చయించె ననినఁ దక్కినవారలెల్ల నట్లకాక యని రంత నంతవృత్తాంతంబు విని యశేష రాజన్యలోకంబును నిజసైన్యసమేతంబుగా రాఁబనిచి పాండవేయుల నిజనివాసంబున కనిచి చతుర్థున కొక్క హర్మ్యంబు విడియ నొసంగ నియమించి దుర్యోధనాదులను దక్కిన భృత్యామాత్యవర్గంబును వీడుకొలిపి కొలువు చాలించి యయ్యంబికేయుండు సంజయుకరం బూఁతగాఁ గొని విదురుండును దోడరా నభ్యంతర మందిరంబున కరిగె నంత నానాదేశాధీశులు తమతమ చతురంగ బలంబులతో హస్తిపురికి రాఁదొడంగిరందు. ౨౮.

ఉ. భండనభీమవిక్రముఁడు బాణకళానిపుణుండు మత్తవే
దండఘటాతురంగమరథప్రకరంబులతోడ మత్స్యభూ
మండలనాథుఁడైన యరిమానవిభంజనశాలి యా విరా
టుం డరుదెంచె సంగరపటుత్వమునం గురురాజువీటికిన్ ౨౯.

ఉ. సింధురబంధురాశ్వరథసేవితుఁడై చనుదెంచె సన్నభ
స్సింధు రమానుజాత సురసింధుర పాండురకీర్తి వేడుకన్
సింధువిభుండు సైంధవుఁ డని ప్రముఖాయుధ దీక్షితుండు ద
ర్పాంధుఁడు యుద్ధరంగ నిహతాహితవీరుఁ డుదారమూర్తియై. ౩౦.

క. విందానువిందు లఖిలా । రిందము లుగ్రాహవసుపరిశ్రమసేనా
బృందముతో వచ్చిరి యా । నందం బెసఁగంగ హస్తినాపురమునకున్ ౩౧.

క. మత్తగజదానధారా । యత్తభ్రమరప్రతానహారిస్వనముల్
చిత్తమున మెచ్చుచున్ భగ । దత్తుం డేతెంచె గబ్బితన మేర్పడఁగన్ ౩౨.

క. క్ష్వేడాకంపితకూర్మ । క్రోడదిశాకుంభిగోత్రగోత్రమరుద్భ
గ్రాడంబుధియై సమర । క్రీడారతితోడ దుష్టకేతుఁడు వచ్చెన్ ౩౩.

గీ. దర్పితారాతి వైరికాంతాకుచాగ్ర । హారిహారగుళుచ్ఛ సంహారణచణకృ
పాణభూషిత నిష్ఠురపాణియగుచు । సేనతోఁగూడ నా సుదక్షిణుఁడు వచ్చె.

క. నిజకరిహరిరథసుభట । వ్రజపాదోద్ధూత ధూపరాగపిహిత నీ
రజహితులై కేకయు ల । క్కజముగఁ జనుదెంచిరపుడు గరిపురమునకున్. ౩౫.

క. అక్షీణ నిజమహోత్సుక । లక్షీకృతవైరి నృపకలాపశరీరుం
డక్షౌహిణితోఁ బాంచా । లక్షోణీశ్వరసుతుం డెలమిఁ దావచ్చెన్ ౩౬.

శా. చండారాతిధనకల్యుఁ డున్నత భుజాచంచద్గదాదండ మా
ర్తాండ ప్రోద్భవతుల్యుఁ డుగ్రరిపు వీరస్వాంతశల్యుండు శ
ల్యుం డక్షౌహిణి తన్నుఁగొల్వఁగజయోద్యోగంబుతో వచ్చె ను
ద్దండ ప్రక్రియమించి యచ్చటికిఁ బాతాళక్షమాధీశ్వరా ౩౭.

శా. రక్షోనాథ శిఖావతంసము సమగ్ర ప్రాభవుం డుగ్రయు
ద్ధక్షోణీతల భీష్మమూర్తి రిపుకాంతాకంఠసూత్రచ్ఛిదా
దక్షాక్షుద్రకరాళహస్తుఁడు సముద్యత్తోమరథధూమధ్వజుం
డక్షీణోద్ధతివచ్చె భీమజుఁడు దా నక్షౌహిణీయుక్తుఁడై. ౩౮

శా. అంగాధీశుఁడు చోళవల్లభుఁడు పాండ్యక్ష్మాతలేంద్రుండు కా
ళింగుం డంధ్రవసుంధరాధిపతి పాళిందుండు నేపాళుఁడున్
బంగాళేశుఁడు మాళవక్షితిపుఁడున్ బానాటనాథుండు న
వ్వంగక్షోణివిభుండు నాదిగ జగద్వంద్యుల్ నృపుల్ వేడ్కతోన్ ౩౯.

వ. అరుగుదెంచి మఱియు మాహిష్మతిపతియగు నీలుండును విదర్భాధీశ్వరుండగు రుక్మియును మొదలుగాఁగల నానాదేశాగత రాజన్యులు పదునాలు గక్షౌహిణుల తోడంగూడి చనుదెంచిన ధృతరాష్ట్రసుతులంబున దుశ్శాసనాది ధార్తరాష్ట్రులు తమతమ మూలబలంబు రెండక్షౌహిణులు కొలువ రథాధిరూఢులై యెదురుచని యా రాజసమూహంబుఁదోడ్కొని హస్తిపురంబునకువచ్చి యమ్మ్యోళాపుల విడియ నియమించిన వారలకు నప్పురంబునుం దన్మహోద్యాన ప్రాంగణప్రదేశంబును బట్టఁజాలక క్రిక్కిఱిసియుండెనంత. ౪౦.

గీ. పాండవులుఁ గౌరవులు సర్వపార్థివులును । హస్తిపురమునఁగూడుట యాప్తచరులు
దనకు వినిపింపఁ గృష్ణుఁడుద్ధవునిఁబిలువ । నంపి యాతనితోడ నిట్లనుచుఁబలికె.

క. కలియును నూనెయు బలె మును । గలయక క్షీరోదకముల కరణిం గొంతే
యులుఁ గౌరవులిపు డేననిసన । కలనృపులనుగూర్చినారు కరినగరమునన్ ౪౨

వ. అందు ౪౩.

గీ. పాండవులు నాకు నెక్కింత పనియుఁ జెప్పి । కానిచేయరు నేఁడిట్టికార్యమెత్తి
యెఱుఁగ వినిపింప రిందులకేనెపంబొ । చిత్రమయ్యెడి బుద్ధి నీక్షించిచెప్పుము. ౪౪.

వ. అనవుడుఁ గృష్ణున కుద్ధవుం డిట్లనియె. ౪౭.

గీ. మనకు బంధుల మీ ధరామండలమునఁ । గలుగు నృపులును వారును గలిసినారు
రిపుఁ డొకండును లేఁడు తర్కించిచూడ। నింక నొకమాట వినుమని యిట్టులనియె.

సీ. ఈ ధృతరాష్ట్రుపై నా ధృతరాష్ట్రుండు వచ్చెనో పన్నగవైరిఁ గూడి
యీ రాజరాజుపై నా రాజరాజెత్తి యరుదెంచెనో యక్షు లలమి కొలువ
నీ ధర్మరాజుపై నా ధర్మరాజెత్తివచ్చెనో కింకరావళులఁ గూడి
యీ ధనంజయునిపై నా ధనంజయుఁ డెత్తివచ్చెనో ధర వడవడవడంక
నాత్మఁ బెనగొన్న మహదసఖ్యంబు గలుగు । కతనఁ గకున్న వీరలీగతిని గూడఁ
గ రణంబేమి యచటికొక్కరునిఁ బంచి। తెలియఁగాఁదగు నిది వసుదేవతనయ

వ. అనిన నయ్యాదవోత్తముండు త్రికాలవేదియయ్యును రాజధర్మంబవలంబించి యక్రూరునిం బిలిపించి యతనితో నిట్లని యానతిచ్చె. ౪౮.

క. పాండవులుఁ గౌరవులు వే। దండపురమ్మున సమస్త ధరణీశుల ను
ద్దండతఁ గూరిచిరట యా। దండునకుం బోయి ధర్మతనయాదులతోన్. ౪౯.

క. మన సేమముఁ జెప్పి రయం। బున వారివిధంబు సర్వముం దెలిసి రయం
బున రమ్మని యనుప నతఁడు। చనియె రథారూఢుఁడై గజపురమ్మునకున్. ౫౦.

వ. చని యతఁడు తత్పురప్రాంగణప్రదేశంబులఁ గ్రందుకొనియున్న సకలసైన్యంబుల నున్నత ప్రాకారగోపురాట్టాలక ప్రాసాదంబులం గనుంగొనుచు నరిగియరిగి రాజమందిరద్వారంబున రథావతరణంబుఁ జేసి దౌవారికులచేతఁ దన రాక యాంబికేయున కెఱింగించి తదనుజ్ఞాతుండై సభామంటపంబునకుం బోయి యచ్చట గాంగేయ బాహ్లీక సోమదత్తాదిజ్ఞాతులును యుధిష్ఠిరాదిపాండవేయులును సుయోధనాది కుమారవర్గంబును ద్రుపదసౌబల సైంధవాదిబంధులును మత్స్య మద్ర మగధ మాళవ నేపాళ చోళ తెంకణ కొంకణ కోసల కుకుర కురుకరూశాది నానాదేశాగత రాజవరులును విదురసంజయులుం గొలువ ననర్ఘ్యసింహాసనాసీనుండై పేరోలగంబున్న వైచిత్రవీర్యునకుఁ బ్రణామం బాచరించి కౌంతేయ గాంధారేయాదుల నాలింగనంబు గావించి తక్కినవారలచేత సంభావితుండై యంతకమున్న యొక్కయింతిచేతఁ దనకని పెట్టించిన కనకపీఠంబునఁ గూర్చుండి కుశలపూర్వకంబుగాఁ దత్తదుచిత ప్రకారంబున వినోదాలాపంబులాడుచున్న యక్రూరునకు నజాతశత్రుండిట్లనియె.

క. క్రూరుఁడవుగాని నెపమున। సారససంభవుఁడు నీకు సార్థముగా న
క్రూరుండని పేరొసఁగెను। శ్రీరమణపదాంబుజాత చింతనహృదయా. ౫౧.

మ. హరికిన్ నేమమొ నీరికిష్మదమొ సాత్యక్యాది తత్సోదరుల్
పరిణామంబుననున్నవారె శుకుఁడున్ బ్రద్యుమ్నుఁడున్ సాంబుఁడున్
ధరుఁడున్ మోదముతోఁ జెలంగుదురె యోధశ్రేణికిన్ లెస్సయే
తరుణీసంఘము సంతతంబాదవ నిత్యశ్రీల వర్ధిల్లునే ౫౩

క. అనఘా నీవనిశంబును। వనజాక్షుని సేవఁజేయువాఁడవు నెయ్యం
బున నొక్కవేళను దలం। చునె మమ్ముం గృష్ణుఁడు దయసొంపున ననుడున్

గీ. ఆ యుధిష్ఠిరుతోడ నిట్లనియె గాంది। నీతనూజుండు తననేర్పునెగడఁ గృష్ణు
నకును మీకును భేదమున్నదె యతండు। మిమ్ము నేప్రొద్దుఁదలఁచు నర్మిలిదలిర్ప

వ. అనవుడు నయ్యజాతశత్రుండు సంతసంబునంబొంది మహాత్మా భవదాగమనంబు
నకుం గారణం బెయ్యదియనిన నక్రూరుం డిట్లనియె. ౫౪

ఉ. మీరును ధార్తరాష్ట్రులును మించినవైరముదక్కి క్షీరమున్
నీరముఁబోలె నేకముగ నెమ్మిఁజరించుట రాజవాహినీ
వారముతోడ నిచ్చటికివచ్చుటయుం దనుజాంతకుండు దాఁ
జారులచే నెఱింగి కడుసంతసమొందెఁ బృథాసుతాగ్రణీ. ౫౫

వ. ఇత్తెఱంగున మీ వృత్తాంతంబు విన్నవాఁడై యావెన్నుండు నన్నుం బిలిపించి
యిట్లని యానతిచ్చె. ౫౬

క. నీవచటికరిగి యేమిటి। కైవచ్చిరొ వారిజాడ లరసి వియద్గం
గావరనందనుఁ బొడగని। యా వాఘవిఁజూచి యడుగుమని నన్నాచెన్ ౫౭

వ. ఏనమ్మహానుభావుని యానతి శిరంబున నిడుకొని యరుగుదెంచితి మీర లపారసేనా
సమేతులై యిప్పట్టణంబున నెట్టకేలకుంగూడఁ గతంబెయ్యదియని యడుగనందులకు
నయ్యుధిష్ఠిరుండును దక్కినవారలును మిన్నకయున్న యంత్సన గాందినేయునకుం
గాంధారేయాగ్రజుం డిట్లనియె ౫౮

సీ. అనఘాత్మఁ డీ చతుర్థుఁడు దివ్యహయంబునెక్కి యాకసమున నేగుదేర
నా ఘోటకాస్యంబునం దుద్భవించిన నురువుమారుతముచేఁ దొరఁగి యమున
లోనున్న తనదు కేల్దోయిలోఁబడ్డ నా కృష్ణుండు నెలకు హరింతుననుడు
విని భయంబునఁ దన వెన్నుఁజొచ్చిన వీని గాండీవికరుణతోఁ గావఁబూనెఁ
గాన శరణొందువానిరక్షణముకొఱకు। నేము సేనలతోఁగూడి యిచ్చటనుంట
నెపములేని ప్రతిజ్ఞమాన్పించుటొండెఁ। దేజమొప్పంగ నితని సాధించుటొండె

క. పని యిదియె మాకు నిప్పుడు। విను మయ్యాదవుఁడు ప్రతినవిడిచి యతనిఁ దా
మనుచుటమంచిది లేదా। తనబలిమియు మాబలంబుఁ దానే యెఱుఁగున్. ౫౯

శా. ద్రోణాచార్యుఁడు భీష్ముఁడుం గృపుఁడుఁ గర్ణుం డర్జునుండున్ జగ
త్ప్రాణాత్మోద్భవ ధర్మజుల్ గవలు నా హైడింబుఁడున్ ద్రౌణియున్
క్షోణీనాథుఁడుఁ బోరనిల్వఁగ బిడౌజుండో యజుండో కదున్
వేణుధ్యానముఁ జేసి గొల్లసతులన్ వేఁగూడుటో కయ్యముల్ ౬౩.

వ. కావున బహుశాస్త్రజ్ఞుండవగు నీవు మీకృష్ణునకు బుద్ధిఁజెప్పి యీ చతుర్థుఁ
బంపెదనన్న ప్రతినమాన్పించు మనవుడు నక్రూరుం డతని కిట్లనియె. ౬౪

గీ. రాజ్యగర్వంబు పెంపున రాజరాజ । మీఁదు గానక యాడితి మిన్న నీవు
సత్యసంకల్పుఁడైన యీ చక్రపాణి । ప్రతినమాన్పెదనని పూన బ్రహ్మతరమె ౬౫.

చ. సురలజయించి దేవపురి చూఱలుపట్టి సమస్తలోకముల్
పోరిఁబోరి నేర్చు నయ్యసురపుంగవకోటుల మాటమాత్రలో
శరములపాలుచేసి దివిషద్వరులెల్ల నుతింపఁబొల్చు నా-
హరికిని మీకు హస్తిమశకాంతర మారసిచూడ నెమ్మెయిన్. ౬౬.

సీ. కల్పాంతశిఖికల్ప కాళీయ ఫణములఁ జిదమిదగాఁబట్టి మదమడంచె
సత్వనిర్జితదిశా సామజశ్రేష్ఠంబుఁ గువలయాపీడంబు నవనిఁగూల్చె
విశ్వలోకాప్రతివీరుఁ జాణూరుని బాహుయుద్ధంబునఁ బట్టిచంపె
బంధురభటు జరాసంధుఁ బదునెనిమిదిమాఱులు రణభూమిఁ బాఱఁదోలె
నరకమురదైత్యనాథుల నఱకివైచెఁ । బారిజాతంబుఁ గొని యింద్రు భంగపఱచె
బలితనయుతోడఁ బురహరుఁ గలసనోర్చె । నద్దమేవాఁడుగలిగె బ్రహ్మాండమునను

క. పగ యీ విభుతోఁ దలకొనఁ । దగదని తెలుపంగ నసికిఁదార్కొనితిర యేన్
దగరు గిరిఁబొని తనతల । పగులఁగఁ దాఁకుటయెగాదె పరికింపంగన్. ౬౮.

క. కావున మీరందఱు నీ । భూవల్లభుఁ దోడుకొని ప్రభుత్వముతో మా
శ్రీవనితాధిప పదరా । జీవంబులు శరణుఁజొరుఁడు చేకొను మిమ్మున్. ౬౯.

వ. అనుడు నాసుయోధనుండు కోపోద్దీపితమానసుండై యక్రూరున కిట్లనియె ౭౦

శా. ఏమేమీ హరిశూరుఁడంటి నిజమా నే యీ జరాసంధుఁ డు
ద్దామప్రక్రియఁ జుట్టికొన్నఁ బురమున్ దర్పంబు డించెన్ సమి
త్సీమం దాయవనుండు ద్రోల గుహఁ జొచ్చెన్ జూడఁగా నిన్నఁ గా
దా ము-జేతుల కంకణంబులకు నద్దంబేల యక్రూరకా. ౭౧

వ. అనవుడు నతం డాసుయోధను నలక్ష్యంబుఁ జేసి యుత్తరంబియ్యక భీష్ము నుద్దేశించి
మహానుభావా యితండు మదాంధుండు గావున నవ్వీరాగ్రేసరు ప్రభావంబెఱుంగక
యాడెడు శతానందశతంబును సంక్రందన సహస్రంబునునైన నానందకధరుండు

కృష్ణుం డుగ్రుండై చూచిన యుద్ధంబున నిలువ నసమర్థంబుగావున మీరెఱుంగని
యర్థంబులే దా హరితోడి యారోధనంబుమాని శరణాగతులై మనుం డనవుడు
మాఱుత్తరంబియ్యం డయ్యెనంత నక్రూరుం డకౌంతేయుల నుపలక్షించి యిట్లనియె
ఉ నీనియతోడి కప్పురపుమగ్గు తెలంగున ధార్తరాష్ట్ర సం
తానముఁగూడి మీరు సతత స్తవనీయచరిత్రులయ్యు స
న్మానవిహీనులై దురభిమానముఁజెంది చరింపనేల మీ
మానసవీధిఁజూడుఁ డిది మంచిదొ కృష్ణునితోడు మంచిదో. ౭౩.
క హరి మీకుఁ బ్రాణబంధువు । గురువుఁ సచివుండు రక్షకుఁడునై మిమ్మె
పుడుఁ గూర్మి నెల్లవేళల । నరయుచు రక్షించినందుకా యిది దలఁపన్. ౭౪.
వ ధార్తరాష్ట్రులు సహజశాత్రవులయ్యు మిత్రభేదంబుకొఱకు మిమ్ముఁ బొదివినా
రింతియె కాని నిక్కంబగు మక్కువఁగాదు కృష్ణుండు మీమీఁద దయదప్పినప్ప
డఖిలరాజ్యంబునుం జేకొనందలంచినారుగావున నీనృపకీటకంబుఁ జేపట్టి శార్ఙితోఁ
గపటంబునేయుట కర్జంబుగాదని యర్జునునకిట్లనియె ౭౫.
క. విరసింపఁ దాతతనయునిఁ । బొరిగొను కృష్ణునకు నితరుఁ బొరిగొనుటరిదా
మఱిదివను చనవుమానుము । హరిశరణముఁ జొరుము భద్రమయ్యెడుఁ బార్థా.
వ అనిన నయ్యక్రూరునకు నతం డిట్లనియెఁ గృహీత పరిత్యాగంబు నేయరామి నెఱుం
గవే సర్వభూతాంతర్యామియగు నప్పరమేశ్వరుం డేమి నేసినఁ జేయుంగాత
మనియెఁ దదనంతరంబ యుధిష్ఠిరాదులతనితో మా విన్నపంబుగా రమావల్లభునకు
నెఱింగింపుమని యథోచితవచనంబులు కొన్నిపల్కి యేమతని సమ్ముఖంబునకు
నొక బుద్ధిమంతునంపి సర్వంబు విన్నపంబుఁ జేయించిన యటమీఁదఁ గావలసిన
యుద్ధంబయ్యెడునని వినయపూర్వకంబుగా ననిపిన నయ్యక్రూరుండు రథారోహ
ణంబుఁజేసి రయంబున ద్వారకానగరంబునకుం జని. ౭౬.
క తనరాక యొక్క వేత్రక । రునిచేఁజెప్పింప విని యరుగుదే నియమిం
చినఁ జని సోదరులును నం। దనులుఁ గొలువనున్న మురమథనుఁగని మ్రొక్కెన్.
వ. ఇట్లక్రూరాంతకునకు నమస్కరించి యతని యనుమతి నొక్క సువర్ణపీఠంబునం
గూర్చున్న యవసరంబున నవ్విభుం డచ్చటి వృత్తాంతంబేమని యడిగిన నతండిట్లను
దేవా భవదనుజ్ఞాతుండనై కరినగరంబునకరిగి యచ్చట నాంబికేయు నేకొలగంబు
నకుం జని యాతని యాదరణంబున నొక్క పీఠికాసీనుండనై యుచితాలాపంబు
లాడుచున్న నయ్యజాతశత్రుం డిచ్చటి యోగక్షేమంబడిగిన నేనందుల కుత్తరం
బిచ్చిన పదంపడి దుర్యోధనుండు శరణాగతుండైన యీ చతుర్థనుం గాచెదనని

మావిజయుండు పలికిన వీరలతోడం గూడియున్నవారము కృష్ణుం డీ చతుర్థన జననాయకుం జంపెదనన్న ప్రతినమాట గడునుచితంబు లేదా యటమీఁదఁ దానే యెఱుంగునని యివి యాదిగాఁగల యనుచితవచనంబులుపల్కినం దగిన యుత్తరంబిచ్చి యతని లక్ష్యంబుసేయక భీష్మాదులతోఁ దత్తత్ప్రకారంబుల వెన్న చూపి కొన్ని మాటలాడి యాప్రజ్ఞాచక్షునకుంజెప్పి యే నరుగుదెంచు నవసరంబున ధర్మజ భీమార్జునులు దమమాటలుగా భవత్సన్నిధానంబున విన్నపంబుసేయుమని నాతో ననినతెఱంగెఱింగించెద నవధరింపు మందు ధర్మజుం డిట్లనియె ౭౯.

చ కమలదళాక్ష మీజనకు గాదిలిసోదరి మాకుఁ దల్లి భా
వమునఁ దలంచినన్ నెనరువారము వెండియు దేవరందుఁ గూ
రిమిగలయట్టిభక్తులము ప్రీతి మెయిం గరుణింపు సర్వ భూ
రమణులలోన నెయ్యపుమఱందికి నీచనవియ్యఁజెల్లదే ౮౦.

చ వలపరిమానికో దివిజవల్లభునిం దెగఁజూచి వైరులన్
గెలువఁగఁజూచి శుభ్ర[illegible]కీర్తి దిశావళిఁనించి యింతగా
మెలపితి వీవ యిప్పుడొక మేదినికోసకై విరోధివై
నలఁచిన నవ్వరే సురగణంబులు మానవనాథకోటులున్. ౮౧

వ. అనుడు భీముం డిట్లనియె ౮౨.

చ. వెఱపున ధర్మనందనుఁడు విన్నన చెప్పుటగాదు బాంధవం
బఱిగెడునో యటంచుఁ దెగనాడకయుండుటగాని యర్జునుం
డఱిముఱిఁగాచినట్టి మనుజాధిపుఁ బైకొని బ్రహ్మరుద్రు లే
త్తెఱఁ జనుదెంచిరేనియు వధింపఁగనోపుదురే తలంపఁగన్. ౮౩.

క. కావున నీ కుండినపతిఁ । గావు నయంబెసఁగ నట్లుగాదా నన్నున్
దేవేంద్రనందనుని వసు । దేవతనయుఁ జూచి యెఱుఁగుదేకదయనుమీ ౮౪.

వ అనిన యనంతరం బర్జునుం డిట్లనియె ౮౫.

చ వినుమనఘాత్మ నన్ను నరవింద దళేక్షణుఁ డింతవానిఁగాఁ
బెనిచె నతైన నీనృపతిభీతినిఁ జేరినఁ గాచినాఁడ నీ
తనికయిచావ దొండె రణధారుణిలో గెలుపొండె మేలుగా
కని వినిపింపుమీ కొలువునందు బలాదులెఱుంగునట్లుగన్ ౮౬.

వ అని పలికె నంత భీష్మాదులెల్లన్ దేవరసమ్ముఖంబునకు నొక బుద్ధిమంతునంపెదమని నన్నంపిన నేనుం జనుదెంచితినని విన్నవించిన నయ్యరవిందనయనుండు గించి దరుణితలోచనుండై కొలువుగలయం గనుంగొని. ౮౭.

చ. విసుఁగిడి చోద్యమయ్యెఁ బృథివీవరకోటులతోడఁ గూడి నేఁ
గ్రాసిన కుండినేశ్వరునిఁ గ్రీడియె గావఁగఁ బూనెనంట యే
మనఁగలవారమన్న ముసలాయుధుఁ డాలము సేయఁబూనెఁ జే
వనిగుడ మార సాంబకృతవర్మలు నవ్విరి గేలిఁబెట్టుచున్ ౮౭

వ. మఱియు దక్షిణవారెల్లను వీరాలాపంబులాడుచుండిరంత నిక్కడ ధృతరాష్ట్రుండు విదుర సంజయులతోఁ గూడఁ గర్జంబు దప్పెనని కటకటంపడి కొండొకచరలించి కుంతీతనయాగ్రజు నుద్దేశించి యిట్లనియె ౮౯.

శా. అక్రూరుం డరుదెంచి యీకొలువులో సత్యంతవాక్ప్రౌఢి నా
చక్రిన్ సంగరకేళి గెల్వఁగ సరోజాతోద్భవుల్ నూర్వరున్
శక్రుల్ వేవురునైన నోపరనె నాచందంబు నిక్కంబు యు
ద్ధక్రీడన్మనమెంత నీకు నయశాస్త్రప్రక్రియం జెప్పెదన్ ౯౦

చ. వినయవివేకభూషణుఁ బ్రవీణుఁ గులీనుఁ బరేంగితజ్ఞు స
త్యనిరతు బుద్ధిమంతు సుచితప్రభుఁ గార్యధురంధరున్ గృపా
త్ము నతిగుణాకరున్ బతిహితున్ జననాథుఁడు రాయబారిఁ జే
సిన నతఁ డెట్టిదైన ఫలసిద్ధిఁగఁ జేయు సమస్తకృత్యముల్. ౯౧.

వ. కావున నిట్టిగుణంబులుగలవాని నయ్యాదవవల్లభుపాలికిం బెట్టి పంపుదమనుడు వల్లెయని కౌంతేయాగ్రజుండు తనతో విచారింప శంతనతనయుం డిట్లనియె ౯౨.

క. దేవాజేయుఁడు బలమున । దేవాచార్యుండు నీతి ధీరత్వమునన్
దేవాచలంబు మన సహ । దేవుండని బుద్ధిఁ దెలిసితిన్ ధర్మసుతా. ౯౩

క. అని యెఱిఁగించిన యమునం । దనుఁ డప్పుడు పిలిచి నకులు తమ్ముని నాశాం
తనవుని ముందఱ నిడి యా । తనితో నిట్లనియెఁ దా నుదారప్రౌఢిన్. ౯౪.

సీ. వత్స నీనేర్పుమీఱ నవ్వాసుదేవు । నకును నెఱిఁగింపుమని వచనములు గొన్ని
చెప్పి నదీసుత గురు యుధిష్ఠిర వృకోద । రార్జునాదులమాటల నాత్మనిలిపి ౯౫.

వ. అందఱిచేతను ననుజ్ఞాతుండై యరుగ ధర్మజుండు తిరుగం బిలిపించి యిట్లనియె

క. సహదేవ నీవచనముల । కు హలాయుధ కృష్ణ సాత్యకులుఁ బ్రద్యుమ్నా
ది హరికుమారులు నతికుపి। తహృదయులై పల్కినను బెదరకుము తాల్మిన్ ౯౬.

వ. అని బుద్ధిఁ జెప్పి యనిపిన రథారూఢుండై మితపరిజనంబులు గొలువ ద్వారవతీపురంబునకుం బోయి రాజమార్గంబునఁ దత్తద్విశేషంబు లీక్షింపుచుఁ జనిచని పెనుమొగసాలఁ దఱిసి రథంబుడిగ్గి ద్వారపాలకులచేతఁ దనరాక విన్నపంబు సేయించి తదనుజ్ఞానుపూర్వకంబుగా నాస్థానమంటపంబునకుం జని. ౯౭.

రేవుణూరి - వేంకటార్యుఁడు.

ఇతఁడు శకుంతలాపరిణయమను మూఁడాశ్వాసముల ప్రబంధమును రచియించెను. ఇతఁడు నందవరీక వైదిక బ్రాహ్మణుఁడు, శ్రీవత్సగోత్రుఁడు; తిరుమల కొండయార్యపుత్రుఁడు. ఈతఁడు తన శకుంతలాపరిణయము నొకానొకరాజున కంకితము చేయ నుద్దేశించి యుండఁగా నొకకరణము విఘ్నమాచరించినట్టును, అందుచేతఁ దన కృతిని వేంకటేశ్వరుని కంకితముసర్చినట్టును, కవి యీ క్రిందివాక్యములలో వ్రాసికొనియున్నాఁడు —

వ "అపూర్వపూర్వకవి సుపర్వసానుగ్రహంబునఁ బుణ్యగుణకథాశ్రవణ కుతూహలికబుధా సదానుబంధంబగు నొక్క ప్రబంధంబు సరస సుమనోనుబంధంబుగా నిర్మింపంబూనియున్న సమయంబున నతిప్రభావసంపన్నుండగు కశ్చిత్ప్రభుండు.

శా శ్రీవత్సాన్వయు రేవుణూరికులజుఁ శ్రీపాదరేణు ప్రభా
సౌవర్ణ్యస్ఫుట కావ్యకల్పకకవిన్ సంకీర్తనాచార్య పు
త్రీవంశోత్తము నందవైదికబుధాది ప్రోక్తవృత్తి స్వయం
భావుఁ దిర్మల కొండయార్యసుతు శుంభద్వేంకటాభిఖ్యునిన్

క పిల్వంబంచి యెదుర్కొని । మిలమిల నలఘుప్రభా సమిద్ధాస్థాన
స్థలిఁ జాఁగిలి మ్రొక్కి పటీ । కలిత సుఖాసీనుఁ జేసి కలకల నగుచున్.

చ కనుఁగొని చండికాభిసుముఖప్రద నందవరాగ్రహార పా
వన ఘన పెద్దిభట్టకులవార్ధినిశాకర నీవు శ్రీనివా
సుని యలమేలుమంగకృపఁ జొక్కిన దిక్కరి వాంధ్రభూమిరా
డ్వినుత సభ స్థలీవన నవీనపికంబవు కాకలీకృతిన్

శా. సల్లాలిత్యభవత్కవిత్వపటిమా సందర్భ వైదర్భికా
సల్లాపంబులు మామకీనకులస్వామీంద్ర కీలాద్రి రా
ణ్మల్లేశుండును మెచ్చ నొక్క కృతి నిర్మాణంబు గావింపుమా
మల్లీఫుల్ల సుమోల్లసన్మధురఝరీమాధుర్య కౌదార్యతన్

మ అని హేమాంబర రత్నభూషణ సుగంధాలంకృతుం జేసి స
ఘ్నన సారస్ఫుట వీటికాదులొసఁగన్ గైకొంచు వాణీ వధూ
వనజాతాంఘ్రిఘులద్ఘల న్నటనజిహ్వాస్థాన వాగ్గోస్తనీ
జనితానందమరంద కందళ నదీ జంఘాల వేలాస్యుఁడై.

వ అమ్మహాకవివరుండును దదీయ వంశావతార నిర్ణయ వర్ణనానుపూర్వంబుగాఁ దత్ప్రబంధబంధురానల్పకల్పనంబొనరించి తత్సముచిత కృతికన్యాకరణంబునకు

నవకరణంబుగా నుపకరణంబగు నొక్కకరణంబు కృతఘ్నుండై విఘ్నంబు
చేసిన .... శ్రీ వేంకటరమణునకు . .. దండప్రణామ
పుష్పాంజలీ ప్రపూర్వభర సమర్పణంబుగా సమర్పించెద.

ఇంతచెప్పినవాఁడు కశ్చిత్ప్రభుండనక యా ప్రభుఁడెవ్వఁడో పేరొక్కనియుండిన పక్షమునఁ గవికాలనిర్ణయమున కనుకూలపడియుండునేమో! అయినను గవి తన శకుంతలాపరిణయమునందుఁ జేసిన యీ కవివర్ణనమునుబట్టి యితఁడాధునికుఁడగుట స్పష్టమగుచున్నది—

మ. పరఁగన్ భారత కల్పనాగతులు శబ్దస్ఫూర్తిసంధింప ని
ర్భరవృత్తిన్ బరమేశ పోతఘనులాలంకారముల్గూర్పఁ జూ
పరులైనట్టి పితామహాద్యులు నుతుల్పాటింప నర్తించు నీ
సరసాంధ్రోక్తివధూటి కేను సుమనస్సంపూర్తిగావించెదన్.

ఈకవి నూఱు నూటయేఁబది సంవత్సరముల క్రిందట నుండియుండవచ్చును ఇతఁడు శబ్దాలంకారములనిమిత్త మమితముగాఁ బాటుపడి గ్రంథమునందు వ్యాకరణదుష్టము లైన ప్రయోగముల ననేకములను జేసియున్నాఁడు వసుచరిత్రములోని కల్పనలను బోలిన కల్పనల ననేకములఁ జేసినను మొత్తముమీఁద నీతని కవిత్వము శబ్దాలంకారభూయిష్ఠమయి హృద్యముగానున్నది ఇతఁడు తాను రామచంద్రోపాఖ్యానమను మఱియొక గ్రంథమును జేసినట్లు చెప్పుకొనెనుగాని యాగ్రంథము దొరకలేదు. ఈతని కవితారీతిని జూపుటకయి శకుంతలాపరిణయములోని కొన్నిపద్యముల నిం దుదాహరించుచున్నాను—

ఉ. సింగములెన్న వీరలకు సిద్ధముగా మొలబంటి మత్తమా
తంగ శిరస్తటంబులు పదంపడి ఱొమ్ములబంటి యంచు సా
రంగ చయంబులెల్లను సరాసరిగా నెదిరింపలేక మా
వంగడపున్వధూమణుల వాలికచూపులకున్ భయంపడున్ — ఆ ౧.

ఉ. శ్రేణులుగట్టి మౌని జనశీర్ష జటాచ్ఛట లుద్గమింప న
క్షీణవిరాగయోగములు చెందును బల్లవరాజకోటికిన్
స్థాణులకున్ సరాగగుణసారతరాంకురలబ్ధి గల్గు పూ
బోణులమేనివాసనలు పొర్లినమాత్రఁ దదాశ్రమంబునన్.— ఆ ౨.

ఉ. వారని ప్రేమ నేగి రెటువారనినన్ విని మారునిద్దపున్
వారువమైనయక్కలికి వారు వనంబునకున్ ఫలంబు ల
వ్వారికిఁ దేరఁగాఁ జనిరి వారిఁ గనుంగొను గారవంబునన్
మీరరుదేరఁగాఁ దెలిసి మీఱరువారిటవత్తురింతకున్.— ఆ. ౩.

అంగర - నృసింహాకవి.

ఇతఁడు రాజరాజాభిషేకమను నైదాశ్వాసముల ప్రబంధమును రచియించి, కొప్పుల వల్లభూవరున కంకితముచేసెను ఈకవి రామకృష్ణభట్టారకుని కుమారుఁడు ఈ కవి యేకాలపువాఁడో నిశ్చయముగాఁ దెలియరాలేదు. ఇతఁ డల్లసాని పెద్దనాదులను పేర్కొనక శ్రీనాథునివఱకును గల కవులనుమాత్రమే కవిస్తుతిలోఁ జెప్పియుండుటచేతను, మధ్యకవులుమాత్రమే పేర్కొన్న చిమ్మపూడి యమరేశ్వరుని సంస్తుతించియుండుటచేతను నృసింహకవి మధ్యకవులలోనివాఁడేమో యని సందేహము కలుగుచున్నది. ఇతఁడు చేసిన కవిస్తుతిపద్యముల నిం దుదాహరించుచున్నాను—

క. భారతఘట్టోల్లంఘన । పారీణకళాధురీణ బంధుర ధారా
ధీర ప్రబంధ గంధ । ర్వారూఢుని భట్టనన్నపార్యునిఁ దలఁతున్

ఉ. అంజలిచేతుఁ బద్మజనిశాతకరాంత నిరంతరోల్బణ
స్మంజులవల్లకీ మధురమంద్రనినాదసముల్లసద్వచో
వ్యంజకవాఙ్నిగుంభన సమంచిత నూతనసృష్టి చాతురీ
రంజిత సత్కవీంద్ర బుధరాజికిఁ దిక్కన సోమయాజికిన్.

ఉ. ఇద్ధగుణుం బ్రబంధ పరమేశ్వరు నెఱ్ఱనప్రెగ్గడన్ మనః
పద్ధతినిల్పి సూక్తి రుచి భాస్కరుఁడైన హుళిక్కి భాస్కరున్
బుద్ధిఘటించి సంతతముపూని భజింతు వచఃప్రసాద సం
సిద్ధునిఁ జిమ్మపూడి కులశేఖరు నయ్యమరేశసత్కవిన్.

క. పాథోధిపయోభర ని । ర్బాధచల ద్ఘుమఘుమాయమానలహరికా
పాథేయదాయిసూక్తి స । నాథున్ శ్రీనాథు నెమ్మనంబునఁ గొలుతున్.

ఈగ్రంథ మొకవేళ మధ్యకవులకాలములోనిదేయైనను దీనియందు లక్షణవిరుద్ధములైన ప్రయోగములు కొన్ని కానఁబడుచుండుటచేత నప్పకవీయాదులు తమ లక్షణగ్రంథములలో నిందలి పద్యముల నుదాహరింపకపోయియుండవచ్చును. కృతిపతినిబట్టి సహితము కవియొక్క కాలనిర్ణయమును జేయుట కెవ్వి డాధారములు దొరకలేదు. కృతినాయకునకు కొర్గాపురము రాజధానియైన ట్లీ క్రిందిపద్యమునఁ జెప్పఁబడినది—

సీ. కుదురయ్యె నేవీటికోటలోపల వైశ్యానుప్రతిష్ఠితుఁడైన శూలపాణి
పాయలేఁ డేవీటిపర్యంత వనవాటి మిండరాయండు లక్ష్మీధవుండు
నిండారు నేవీట నెండకాలమునందు జలజాకరంబైన సాగరంబు
చెనరొందు నేవీట సార్వకాలిక ఫలస్ఫురితంబు వేడంగి పోఁకతోఁట
సురపురంబునకైన నబ్బురములగుచు । విజ్జివీఁగుచునుండు నేవీటిసిరులు
వసుమతీపాదపద్మ సంవలితరత్న । నూపురంబగు నట్టి కొర్గాపురంబు

ఈకొర్గాపురము విశాఘపట్టణమండలములోని కోట్రాము గ్రామమేమో. ఈ పురాధిపతియయిన కృతిపతి శూద్రకుల సంజాతుఁడు

సీ. మూర్ధాభిషిక్తుల ముకుటంబు లేరాజు పాదపీఠికకు సోపానపంక్తి
చతురబ్ధివలయిత క్ష్మితలం బేరాజు బాహుదండమునకు బాహుదండ
భువనంబులేలుకప్పురగంధి యేరాజు లీలాకటాక్షపాళికకు నీడ
రజనికాంతజయంత రతికాంతు లేరాజు రూపరేఖకుఁ బ్రతిరూపకంబు
అతఁడు పట్టుతలాటకేళాదిరాయ। రాజదేవేంద్రరాజాధిరాజ చంద్ర
గాయిగోవాళ జగన్మోహ్నగండబిరుద। శాలి కొప్పుల వల్లభూపాలమౌళి.

మ. భరియించెం జతురర్ణవీవృత మహాభారంబు దోఃపీఠికన్
విరియించెన్ విమతాంధకారము సముద్వేల ప్రతాపోన్నతిన్
గురియించెన్ ధనధాన్యరాశి కవిరాట్కోటీ నివాసంబులన్
వరియించెన్ వరకీర్తికాంతఁ దనరన్ వల్లక్ష్మితీశుఁ డిలన్.

ఇత్యాదిపద్యములలో బిరుదాంకములలో వర్ణింపఁబడియుండుటచేతఁ గృతిపతి కవి చెప్పిన ట్లఖండ భూమండలాధిపతి కాకపోయినను చిన్న సంస్థానాధిపతియైనట్లు కనుపట్టుచున్నాఁడు స్పష్టముగాఁ దెలియువఱకును గవికాలము నిప్పుడు పదునాలువందల యేఁబదికిఁ దరువాతికాల మనుకొందము. ఈతని కవిత్వమునందు లక్షణదోషము లనేకములుగలవు. ఇతఁడు ప్రబంధములోని యీ మొదటిపద్యములోనే వ్రాయుట యని యుండవలసినదానికి వ్రాసుట యని ప్రయోగించినాఁడు—

ఉ. శ్రీసతి చన్నుఁగ్రేవలను జెక్కులనొక్కుటఁ బత్రభంగముల్
వ్రాసుటకున్ విరించి నిటలంబుల నొక్కట భాగ్యవర్ణముల్
వ్రాసుటకున్ జతుర్భుజవిలాసము పూనిన వేల్పు సత్కృపో
ల్లాసమెలర్పఁ బ్రోచు శుభలక్షణుఁ గొప్పుల వల్లభూవరున్.

ఇట్లుకొన్నిదోషములు కానఁబడుచున్నను మొత్తముమీఁదఁ గవిత్వము రసవంతముగానే యున్నది రాజరాజాభిషేకములోని కొన్నిపద్యము లిందుదాహరింపఁబడుచున్నవి—

చ. పనివడిచెప్పనేల శిశుపాలుని విక్రమచేష్టితంబు లా
తనిపనిపూని దానవపదాతులువచ్చిరి వీరెవారె యం
చనిశము దెప్పవెట్టక సురావళి దిక్కులుచూచుచుండఁగా
ననిమిషనామమొక్కటియు నర్థముదప్పకయుండె నిప్పుడున్.— ఆ. ౧

ఉ. ఆరయ విన్నమాత్రమునసైనను జూచినమాత్రనైన నె
వ్వారిమనంబులం బ్రణయవాసితస్త్రైయనురాగకందళం

చీరికలెత్తఁ గారణ మొకించుకలేకయుఁ బూర్వజన్మసం
స్కారవిశేషముద్రఁ దదవికస్వరమై కొనసాగు నుర్వరన్.— ఆ ౨

చ. అమృత సరోవరంబుగ హిమాంశుని మూర్తి కరంగి లోని చి
హ్నము వికచోత్పలప్రకరమై చెలువొందిన నందులోన సం
భ్రమమున నీఁదులాడి జడిమంబున నంగములూను నేని యా
హిమమున నించుకేని శమియించునొకో మదనాస్త్రవేదనల్ — ఆ. ౩.

శా. శుద్ధాంతఃకరణైక యోగ్యమగుచున్ శోభిల్లు నస్మద్వచో
రాద్ధాంతంబిది యిచ్చగింపక వృథా ప్రజ్ఞాపరిజ్ఞాన స
న్నద్ధులొక్కందఱు కేవలంబుగ వితండావాదులై తా రసం
బద్ధోక్తుల్వచియించిరేని మదమూర్ఖన్వారి ఖండించెదన్.— ఆ ౪.

మ. మహిలో నీకిటుకున్ననేను విమతమ్మన్యత్వము ల్పూనటల్
సహియింపందగునంచు నిప్పుడను విజ్ఞాపింప మాకేటికిన్
గుహనానాటక సూత్రధార భువి నీ క్రొవ్వాడి మాయావిధుల్
బహురూపంబులు పన్నఁగాఁ దిరుగరే బ్రహ్మేంద్రచంద్రార్కులున్.— ఆ ౫.

నారన సూరన.

ఇతఁడు వనమాలివిలాసమను కావ్యమును జేసి, కొండూరి యక్కదండనాథుని కంకితముచేసెను నావద్దనున్న యీ గ్రంథముయొక్క ప్రతి యసమగ్రమయినది, అవతారికలేదు. కృతిపతిమంత్రియు దండనాథుఁడునయి యజ్ఞముచేసిన నియోగి బ్రాహ్మణుఁడు కవినారనామాత్యుని కుమారుఁడైన నియోగివిప్రుఁడు ఇతఁ డాధునికుఁ డని చెప్పుట తక్కఁ గవికాల నిర్ధారణముచేయుటకుఁ బుస్తకమునం దాధార మేదియుఁ జిక్కలేదు ఈతని కవిత్వము సలక్షణమయి మృదువుగానున్నది వనమాలివిలాసములోని కొన్నిపద్యముల నిం దుదాహరించుచున్నాను—

ఉ. గొజ్జఁగి నీరుపోసి సమకూర్చిన చందనవారిఁ దోఁచి లా
మజ్జక తాళవృంతముల మాటికిఁ ద్రిప్పఁగ రాలు శీకరం
బజ్జలజాక్షు చెక్కిళులయందుఁ దనర్చె ముఖేందుసుజ్వరం
బుజ్జనచేయఁగూడఁబడియున్న యుడుప్రకరంబు చొప్పనన్ — ఆ ౧

చ. మెఱయు కపోలపాళికలమీఁదఁ జలన్మణికుండలద్యుతుల్
గిఱికొన ఫాలభాగమునఁ గించిదుదంచిత నర్తనంబులై
నెఱికురులింపుచేయఁ గమనీయవిలోచన లూఁచిరౌదలల్
ఔలిభవద్యశోమహిమ కోమలి మాటికిఁ జెప్పుచుండఁగన్.— ఆ ౨

చ. కల మధురంబులైన కలకంఠి వచోరచనా నిగుంభనం
బులు విని సిగ్గునం బలుకు పూఁకలెల్లను బోవడించి మూఁ
గలవలె నోళ్లుమూసికొని కాననసీమలఁ జేరియున్న కో
కిలములఁ బుజ్జగించి పలికెంచు మధూదయమాత్మసంగతిన్ — ఆ 3.

ఉ. తొల్లియు మోసపోయితివె తోయరుహాసన పెక్కుమాటలో
చెల్ల మదీయధౌర్త్యములచేతనె యిప్పుడు నమ్మికానె నీ
యుల్లము సారెసైత్తులిడుచున్నది యీ క్రియనాడుమంచు నా
కల్లతనంబు లింతటివిగాఁ దలపోయ నరాళకుంతలా — అ. ౪

మఱింగంటి - సింగరాచార్యులు.

ఈకవి దశరథరాజనందన చరిత్రయనెడు నిరోష్ఠ్యరామాయణమును రచియించెను ఇతఁడు శ్రీవైష్ణవబ్రాహ్మణుఁడు, మౌద్గల్యగోత్రుఁడు, తిరుమలాచార్యపౌత్రుఁడు, వేంకటాచార్యపుత్రుఁడు ఈకవి తానేకైకదిన ప్రబంధరచనాధురీణుఁడ ననియు, ఆంధ్రభాషా నిరోష్ఠ్యాదివింశతిప్రబంధ నిర్మాణుఁడననియు, వ్రాసికొనెను గాని యితఁడు రచియించిన యితరగ్రంథము లేవియు నిప్పుడు గానరావు. ఇతఁడు నూటయేఁబది సంవత్సరములక్రిందట నుండిన ట్లీతని వంశమువారు చెప్పుచున్నారు. ఈకవి వాసస్థలము దేవరకొండసీమ ఈతని కవిత్వము సలక్షణమయి హృదయంగమముగా నున్నది. దశరథరాజనందనచరిత్రములోని కొన్నిపద్యముల నిందుదాహరించుచున్నాను —

చ. కరిఘటలేల చిత్రగణికాచ్ఛటలేల హిరణ్యశాటికా
హరి ధనధాన్యరత్నఘటితాచ్ఛదలంక్రియలేల నల్దిశల్
స్థిరగతినేలఁగాఁదగిన తేజదియేల యనేకచర్యలన్
సిరిగలయట్టిసంతతిని జెందిన యాయెడ లెస్సలన్నిటన్ — ఆ ౧.

చ. అనఘచరిత్ర నిన్నని జయక్రియఁ జెందితిఁ గానఁ దాఁచకే
కనకకిరీటహార కరకంకణ చిత్రక రత్నచేల చం
దనసటచేటికా రజత దంతిశతాంగహయాది కాంతలె
ల్ల నడిగినంత నేతనియ లాలననిచ్చెదఁ గీర్తిహెచ్చఁగన్ — ఆ. ౨.

చ. అని తృణలీలగాఁ దెలియనాడి తదాజ్ఞధరించి తాటకా
తనయ నిశాచరాగ్రణి సదాగతి ధిక్కరణాచ్ఛ శీఘ్రఘన
ర్తన ఘటియిల్లఁగాఁ గదలి దండకకాననధాత్రిచేరఁగాఁ
జని ఖరహంతఁగాంచి దృఢసాహసహర్ష రసాతిశాలియై — ఆ 3

మ అగజాజాని ననేకకంధరలచే నర్చించి జన్మస్థలిన్
దిగధీశాదితినందనచ్ఛటల నర్థిన్ గెల్చి శంకించకే
తెగి కైలాసగిరిం దృణాకృతిగ నెత్తెంగాన నీతం డహో
జగదారాధ్యత హెచ్చనేరఁ డె సదాచారక్రియం జెందినన్.—ఆ ౪

మ గదకేలన్ ధరియించి చ డతర నిర్ఘాతాట్టహాసక్రియల్
చదలంటం జరణాగ్రఘట్టనల నాశల్ల డిల్లంగఁ దీ
క్ష్ణదశన్ దీర్ఘదృగంచలాగ్నికణసంక్రాంతిం జలించంగ నా
త్రిదశాలింగని కీశసేన యధికార్తిన్ డాఁగెనాయామెడన్ — ఆ. ౫

సిరిప్రెగడ - ధర్మనామాత్యుఁడు.

ఈకవి నలచరిత్రము నాలుగాశ్వాసముల పద్యకావ్యమునుగా రచియించి, శ్రీవేంకటేశ్వరులకంకితముచేసెను ఇతఁడు నియోగిబ్రాహ్మణుఁడు, హరితసగోత్రుఁడు; తిప్పయామాత్యపుత్రుఁడు. ఇతఁడు నలచరిత్రములోఁ దనతండ్రి నిట్లు వర్ణించియున్నాఁడు —

ఉ సూరినుతుండు తిప్పనయశోజలజాక్షికిఁ గ్రీడసల్పఁగా
మేరుధనుర్ధరాచలము మేడ సుధాజలరాశి కేళికా
సారము పువ్వుఁదోఁటదివిషద్ధరణీరుహసంచయంబు నీ
హారమహీధరంబు కృతకాద్రియునై విలసిల్లు నెప్పుడున్.

తనతండ్రి యిందుర్తిసీమలోని వాఁడనియు, ఈ క్రిందిపద్యములలోఁ దనమేనమామ పేరూరి నివాసుఁడనియు, కవి చెప్పుకొనుటచేత నీతఁడు గోదావరీ కృష్ణామండలముల లోనివాఁడని తోఁచుచున్నది.—

సీ తనకేఘనుఁడు ప్రపితామహుండగు లోహితసగోత్రుఁ డల పుల్లదండనాథుఁ
డెసఁగు నేఘనుతాత యసదృశోన్నతి పుట్టమాంబాధవుఁడుతిమ్మనాహ్వయుండు
పెనిచె నేఘనుతండ్రి తనకీర్తిలతలాశలంటఁ బెంపగు తిమ్మయప్రభుండు
వెలయు నేఘను తల్లి విమలపతివ్రత వివిధ సద్గుణశీల వెంగళాంబ
యతఁడు తుమురుగోటివరవంశాబ్ధివిధుఁడు। సతతపేరూరి కేశవస్వామ్యధీన
మానసస్థితిఁబరఁగు నామేనమామ, మతినిగురుసన్నిభుఁడు ధర్మమంత్రివిభుఁడు.

చ వినుమనఘాత్మ ధర్మసుకవీ భవదీయ వచోవిలాసముల్
ఘనకవి హృద్వికాసములుగావె చమత్కృతిమీఱ నీవు నే
ర్పునగతి నిప్పుడా నలచరిత్రము వేంకటశైలరాణ్ణివా
సునకు సమర్పణంబుగను శోభనలీల రచింపుపెంపుగన్

ఈకవి కాలమేదో నిర్ణయించుటకుఁ బుస్తకమునం దాధారము లేవియుఁ గానరాలేదు. ఇతఁడు శ్రీనాథుని వర్ణించియుండుటచేతఁ బూర్వకవి కాఁడనుట నిశ్చయము. ఇతఁ డాధునికుఁడయి యిన్నూఱుసంవత్సరములక్రిందట నుండియుండును. ఈతని కవిత్వము మొత్తముమీఁద నిర్దుష్టమయి యింపుగా నున్నది. నలచరిత్రములోని పద్యములఁ గొన్నిటి నిందుక్రిందఁ బొందుపఱుచుచున్నాను—

ఉ. ధారుణి వీరసేన వసుధావరుబాలఁడు బాల వీరులా
సారసమిత్రు దూఱి తన సన్నిధిఁ జేరినవారి కెల్ల జం
భారియొడల్ సురద్రుకుసుమావళియే యుడివోయె నన్నచో
నౌర గణింపఁగాఁ దరమె యా ఘనుఁ డోర్చిన శత్రుసంఘముల్ — ఆ. ౧.

శా. లీల న్నీలపుటాలమేడకడ లాలింగేలి మైనుంచి జో
జోలక్ష్మీశ కటాక్షవీక్షణయుతా జోజో శుభాకార జో
జో లావణ్యరమాకుమారయనుచుం జోకొట్టుచుం బాడిర
న్నాళీకేక్షణ లా నృపాలసుతు వీణా కోకిలాలాపలై — ఆ. ౨.

ఉ. వెన్నెల చందమామకును వెన్నెలకుం దగఁ జందమామయున్
సన్నుతలీలనందమగు చందమునన్ ధరణీతలేశ యా
కన్నియ నీకు వేడ్క నలకన్నియకీవును జోడుగూడ నేఁ
గన్నులఁ జూతునే మెయని కాంక్షయొనర్చెద నెమ్మనంబునన్ — 〃 ౩.

ఉ. అర్థిఫలప్రదాయక గుణాకర నైషధ సార్వభౌమ కా
ర్యార్థులమైన మమ్ముఁ గృతార్థులఁ జేయఁగదయ్య సర్వశా
స్త్రార్థము లెందు నీవెఱుఁగనట్టివి లేవకదా పరోపకా
రార్థమిదం శరీరమను టాత్మఁ దలంచఁగదయ్య ధీనిధీ — ఆ ౪.

శా. నీతిం జూడదు నరేంద్ర మీనతతుల న్మీనంబులే మ్రింగుటల్
ఘాతక్రీడఁ గుఠారకాష్ఠమిల వృక్షవ్రాతముం ద్రుంచుటల్
జ్ఞాతిత్వంబునఁ గాదె జ్ఞాతులె చటన్ సామాన్యులే చెల్లఁబో
జ్ఞాతిచ్ఛేదనలేనకిమ్మనెడు శాస్త్రంబుం బరీక్షింపవే — ఆ ౫

మ. లలనా ప్రాణసమానవైన నిను నేలా పాయుదే నన్న నీ
పలుకే నమ్మి భవత్పదాంబుజ సమీపక్షోణి నిద్రింపఁగాఁ
గలితవ్యాళ మృగాదిజంతుభయదోగ్రంబైన యీ కానలోఁ
బల నన్వీడఁగ నాడితో నధిప నీపాదంబు లెట్లాడెనో — ఆ. ౬.

వుండనూవచ్చును. వాళ్ళ యింటికాడ యెప్పుడూ "నేతాళలేనే" అనే పెద్ద మనుషులు వినతగ్గపాటలే చెవికి వినబడుతూవుంటవి

ద్వితీయ— మళ్లీ పాడడానికి మన సభానాయకుడికింకా తెలివిరాలేదు. ఈయన నోరువిప్పి కొంత పాటపాడినారంటే, వూళ్లోవున్న భోగంవాళ్లందరూ యిక్కడకు పరుగెత్తుకొని రావలసిందే.

కేతు— మిత్రుఁడా! కొంచెము సేపుతాళు పాటపాడి మంచివాళ్లను చేరువ కాకర్షించడం యెటువంటిదో లోకానికి చూపుతాను

ద్వితీ— మంచివాళ్లను ఆకర్షించి సహవాసంచెయ్యడంలో యీయన తండ్రిగారిని పోలినవారు నిజం చెపుతాను నేను చూచినవారిలో యీయన తండ్రిగారయిన వీరవర్మతో సమానమయిన సత్సహవాసంచేసేమనిషి యెక్కడా నాకంటికి కనఁబడలేదు ఆయన తనకాలమంతా కుక్కలతోనూ గుర్రాలతోనూ గడిపేవాడని యిప్పటికీ యెక్కడచూచినా చెప్పుకుంటారు

కేతు— నాకు యుక్తవయస్సురానీ చెపుతాను అప్పుడు నేను నాతండ్రిగారిని మించినవాణ్ని కాకపోతే నన్ని పేరున పిలువవద్దు. డబ్బు నాచేతిలోకి రావడంతోటే నేను ముందుగా గమళ్లవాడి బొచ్చుకుక్కను కొంటాను. మిత్రులారా! దిక్కులుచూస్తూవున్నారేమి? తాగి సంతోషంగావుండండి. దానిఖరీదు మీరు యెవ్వరూ యిచ్చుకోనక్కరలేదు లెండి.— యెవరు వస్తూవున్నారు?

[పానశాలాధికారి ప్రవేశించుచున్నాఁడు]

పానశాలాధికారి— యెవ్వరో యిద్దరు పెద్దమనుషులు బండియెక్కివచ్చి గుమ్మంలో వున్నారు వారు దారితప్పివచ్చినారట వారు తమలో తాము పురాణవర్మగారిని గురించి యేమో మాటాడుకుంటూవున్నారు

కేతు— ఆ యిద్దరిలో వొకడు తప్పకుండా నా పినతల్లి కూతురిని పెళ్లాడడానికి వచ్చినవాఁడయి వుంటాడు. వాళ్లు— పట్టణంవాళ్లుగా కనఁబడుతూవున్నారా?

పాన— వారు—పట్టణంవాళ్లే కావచ్చును దక్షిణాదివాళ్లుగా కనఁబడుతూవున్నారు.

కేతు— అలాగయితే వారిని యిలాగు తీసుకురా వక్క నిముషంలో వారిపని చక్కచేసి పంపుతాను

పాన— చిత్తము (అని పోవుచున్నాఁడు.)

కేతు— మిత్రులారా! వారు మీ సహపంక్తికి తగరు ఒక్కనిముషం మీరు ఆవతలకు పొండి. సారాబుడ్డిమూత తీసేటంతలో వచ్చి మళ్లీ మిమ్మలిని కలుసుకుంటాను.

మూక— చిత్తము. (అని పోవుచున్నారు.)

కేతు— (తనలో) నా పినతల్లిమగఁడు నన్ను నెప్పుడూ శునకమని పిలుస్తూవుంటాడు. ఆ ముసలివాడితాళంపట్టి యిప్పుడు నా పగతీర్చుకుంటాను. నాకుమాత్రం వక్క భయంవేస్తూవున్నది ఎందుకు భయపడవలెను? అతఁడు నన్ను ఏమిచేస్తాడో చూతాములే సంవత్సరముదాటితే సంవత్సరముకు వెయ్యిరూపాయలు నాచేతులో పడతవి

[పానశాలాధికారి చంద్రభానుని శూరసేనుని వెంటఁబెట్టుకొని
ప్రవేశించుచున్నాఁడు]

చంద్ర — నేఁడు మన ప్రయాణముతో నేను విసిగిపోయినాను. ఆ గ్రామము రెండామడని చెప్పినారు. మనము మూడామడలకంటె నెక్కువగా ప్రయాణము చేసినాము

శూర— ఇదంతయు నీ మితభాషిత్వముయొక్క ఫలము నీవు త్రోవలో నెవ్వరిని దారి యడుగనిచ్చినావుకావు

చంద్ర—కనఁబడినవాని నెల్ల నడిగి తగిన యుత్తరము పొందకుండుట నాకిష్టము లేదు.

శూర— తగినదో తగనిదో నాకిక్కడ అసలే యుత్తరమువచ్చునట్లు కనఁబడదు.

కేతు — అన్నలారా! మీకాభయమక్కరలేదు. అడుగఁదలఁచినదేమో అడుగ వచ్చును మీరిక్కడ పురాణవర్మగారిని గురించి విచారించుచున్నారని విన్నాను. మీరిప్పు డెక్కడ నున్నారో యెఱుఁగుదురా?

శూర— మే మెఱుఁగము మీరు చెప్పినపక్షమున సంతోషించెదము.

కేతు— మీరేదారిని వచ్చినారో యదియైనఁ దెలియునా?

శూర— అదియు తెలియదు మీరిప్పుడు చెప్పినపక్షమున—

కేతు — మీరిప్పు డెక్కడనున్నారో యేదారిని వచ్చినారో యేమియు నెఱుఁగని పక్షమున, మీరు దారితప్పి వచ్చినారని నేను దృఢముగాఁ జెప్పఁగలను.

చంద్ర— మీరు చెప్ప నక్కఱలేకయే మాకీసంగతి తెలియును

కేతు— అన్నలారా! మీరెక్కడనుండి వచ్చినారో నేనడుగవచ్చునా?

చంద్ర— మాకు దారిచూపుట కది యడుగవలసిన యక్కఱలేదు.

కేతు— కోపపడకుండి మీరొకసంగతి యడిగినందున నేనొకసంగతి యడిగినాను అంతే మరేమియులేదు మీకు కావలసిన పురాణవర్మ కొరకొరలాడుచు మొగము ముడుచుకొనియుండెడు వెఱ్ఱిబాగుల ముసలివాఁడుకాఁడా? [illegible] కొక్క కూఁతురును భార్యకొక్క చక్కని యక్కకొడుకును గలరు.

చంద్ర—ఆయనను మేమింకను జూడలేదు. మీరుచెప్పినకుటుంబమాత్రము[illegible]నకున్నది.

కేతు — ఆకూఁతురు గడకఱ్ఱలాగు పొడుగుగానుండి, యెప్పుడును పసతాగిన పిట్టలాగున వదరుచుండును. ఆ చిన్నదాని యన్నగారో సర్వజనప్రియుఁడయి సుందర విగ్రహముగలవాఁడుగా నుండును
చంద్ర— ఈవిషయములో మేము వేఱువిధముగా విన్నాము కూఁతురు లావణ్యవతియైన సరసురాలనియు, అన్నగారు చదువుసాములులేని మోటుపశువనియు, మేము విన్నాము
కేతు— అది యేమయిననేమి? ఈరాత్రి యెట్లును మీరు పురాణవర్మ యిల్లుచేరలేరు.
శూర— మాకు మహావిచారముగా నున్నది
కేతు— అక్కడికిఁ బోవుటకు మీరెంతదూరమో చీఁకటిలో బురదదారిని నడవవలెను (పానశాలాధికారివంకఁజూచి) అన్నా! వీరికి బురదవీధినున్న పురాణవర్మగారి యింటికి దారిచెప్పు, తెలిసినదా?
పాన— పురాణవర్మగారియింటికా? అయ్యలారా! మీరు చాలాదూరం దారితప్పి వచ్చినారు మీరు కొండదగ్గరకు వచ్చినప్పుడు పుంతనుబడిపోవలసినది.
చంద్ర— పుంతను బడిపోవలసినదా?
పాన— అవును. తిన్నగా నాలుగుదారులవద్దకు పోవలసినది.
చంద్ర— నాలుగుదారులా?
పాన— అందులో మీరు పోవలసినదొకదారినే
చంద్ర— నీవు దారి చక్కఁగాఁ జెప్పుచున్నావు!
పాన— మీరు స్మశానవాటికదాకా కుడివైపున పోవలెను; అక్కడనుంచి బండిచాళ్లగురుతుపట్టి తుమ్మతోటదాకా వంకరదారిని పోవలెను, అక్కడనుంచి కొంతదూరము కుడివైపునూ, కొంతదూరము యెడమవైపునూ, తరువాత మళ్లీ కుడివైపునూ, అవతల చెరువుతగిలినతరువాత మళ్లీ యెడమవైపునూ—
చంద్ర— చాలును. నీవు చెప్పినదారి కనుఁగొనుటకంటె స్వర్గమునకు దారి కనుఁగొనుట సులభము.
శూర— మనమిప్పుడు చేయవలసినదేమి?
చంద్ర— గృహ యజమానుఁ డంగీకరించినను మనకిక్కడ చోటులేనట్టున్నది.
పాన— ఇక్కడ గది యొక్కటేయున్నది.
కేతు— ఆ యొక్కగదిలో నిదివఱకే ముగ్గురున్నారు. (కొంచెము సేపాలోచించి) నాకిప్పు డొక్కయుపాయము తోఁచుచున్నది అన్నా! నీవు వెళ్లి అడిగినపక్షమున, మన యెదుటింటి ముసలిది యీరాత్రికి గడ్డిపాకలో కొంచెము స్థలమిచ్చి

తుంగచాప యియ్యకపోదు.

శూర— గడ్డిపాక మాకక్కఱలేదు.

చంద్ర— దాని తుంగచాప తగులఁబెట్టుమను.

కేతు— మీకది పనికిరాదా? ఆలాగయినపక్షమున మఱియొక బస యాలోచింతము. మీరవీధికొననున్న సత్రమున కర్ధక్రోసు దూరము నడవఁగలరా? అది మంచిసత్రము.

శూర— ఈరాత్రికి మాకు గడ్డిగుడిసెలో నివాసము తప్పిపోయి బ్రతికినాము.

పాన— (కేతువర్మతో రహస్యముగా) సత్రమని చెప్పి వీరిని మీ పినతండ్రిగారి యింటికి పంపఁదలఁచుకొన్నావాయేమి?

కేతు— (రహస్యముగా) ఓరి బుద్ధిహీనుఁడా! నోరుమూసికో అది యెవరింట్లో వారే కనుఁగొందురులే (వారితో) వీధికి కుడిప్రక్కను పెద్ద పెంకుటిల్లు కనఁబడినదాఁక మీరవీధినిబడి తిన్నఁగా నడవవలెను. వీధిగుమ్మములో పొగడచెట్టొకటి కనఁబడును ఆ యానవాలునుబట్టి లోపలికిఁబోయి తలుపువద్ద బిగ్గఱగా పిలువుండి.

శూర— మీకు శ్రమయిచ్చినందుకు మన్నించవలెను మేము తిన్నఁగా పోయినయెడల సత్రమునకే పోదుముగదా?

కేతు— అందుకు సందేహములేదు తిన్నఁగాపొండి ఆ సత్రాధికారి మిమ్ములిని లోపలికిఁ దీసికొనిపోయి గౌరవముచేసి తాను గొప్పవాఁడయినట్లు నటించి మీతో సమానముగా కూర్చుండి పంక్తిభోజనమునకు ప్రయత్నముచేయును. అతఁడు తనతల్లి యొక దండనాథుని కూఁతురనియు, పినతల్లి మంత్రిభార్యయనియు, గొప్ప చెప్పుకొనును

పాన— ఆ ముసలివాఁడు వట్టి పదురుఁబోతు. అయినను మంచిభోజనము పెట్టి పరుండుటకు మంచి పరపులుమాత్ర మిచ్చును

చంద్ర— అతఁ డెట్టివాఁడయినను కానిమ్ము మాకు తిన్నఁగా భోజనముపెట్టి పరుండుటకు మంచిచోటిచ్చినఁ జాలును అతనితో మాకితరసంబంధ మక్కఱలేదు ఆ సత్రమునకు మేము కుడివైపునుండి కాదా పోవలెను?

కేతు— కాదు కాదు. ఎడమవైపును. నేను మీతో రెండడుగులువచ్చి మీకు దారి చూపెదను. రండి.

(అందఱు నిష్క్రమించుచున్నారు.)

ద్వితీయాంకము.

---

౧ ప్రదేశము — పురాణవర్మయిల్లు.

[నలుగురు సేవకులతో పురాణవర్మ ప్రవేశించుచున్నాఁడు]

పురా— పెద్దమనుష్యు లింటికివచ్చినప్పు డెట్లు ప్రవర్తింపవలయునో యా మర్యాదలన్నియు మీకు మూడు దినములనుండి నేర్పుచున్నానుగదా! మీ రావిషయమున పండితులయినా రనుకొనెదను మీరుండవలసినస్థానము లెవరివి వారికి తెలిసినవా?

అందఱు— తెలిసినవి మేము సంపూర్ణపండితుల మైనాము

పురా— పెద్దమనుష్యులు వచ్చినప్పుడు బెదరిన చెవులపిల్లులలాగునఁ బరుగెత్తుకొని పోయి వారి మొగమువంక తేలిపాఱఁ జూడఁ గూడదు.

అంద— కూడదు. మేమెఱుఁగుదుము.

పురా— భీమా! నీవు ముందు నిలువఁబడవలెను ఓ సోమా! నీవు నావెనుక నిలుచుండవలెను ఓ సోమా! నీవాలాగున నడ్డిని చేతులుపెట్టుకొని నిలువఁబడఁ గూడదు. నీచేతు లక్కడనుండి తీసివేయుము చూడు భీముఁడు తనచేతు లేలాగునఁ బెట్టినాఁడో!

భీము— నేను నాచేతు లేలాగునఁ బెట్టినానో చూడు. నేను వెనుక సూర్యనమస్కారములు చేసినప్పుడు చేతు లీలాగునఁ జోడించుకొని నిలుచుండుట నేర్చుకొన్నాను. నేను సూర్యనమస్కారములు చేసెడి దినములలో—

పురా— చాలును అధికప్రసంగము చాలించు పెద్దమనుష్యులు వచ్చినప్పుడు కూడ నీ వీలాగుననే మాటాడెదవుసుమా? నీవు వారి యాజ్ఞవేచి చేతులుకట్టుకొని నిలువఁబడి వారుచెప్పెడిదేమో వినవలసినదే గాని నీవు వారితోఁ గలిసి మాటాడఁ గూడదు. మేము భోజనముచేయునప్పు డడిగినదేమో తెచ్చియిచ్చుచు నీవూరక చూచుచు నిలువఁబడవలెను

భీము— అదిమాత్రము నాచేతఁ గాదు. ఎవ్వరైన నేదైన తినుచుండుట కొంచెము కంటఁబడఁగానే నానోటినుండి యూటలు బైలుదేఱి యావస్తువు నోరవేసికొనువఱకు నన్ను నిలువనియ్యవు

పురా— ఓరి పశువా! కావలసియున్నపక్షమున నీవు తరువాత వంటయింటిలోనికిఁ బోయి కావలసినన్ని తినరాదా? నీకడుపుకు బుద్ధిచెప్పి మాభోజనములయినదాఁక కొంచెము సేపు తాళు.

భీమ— నాకు కావలసిన పిండివంటలు దాఁచి యట్టె యుంచినపక్షమున కొంచెము సే

ఏలాగుననైనను తాళియుండెదను బూరెలెవ్వరికిని వేయక నానిమిత్త మట్టె యుంచుమని యిప్పుడేపోయి వంటబ్రాహ్మణునితోఁ జెప్పివత్తునా?

పురా— ఓ భీమా! నీవు వట్టి వదురుఁబోతువు భోజనకాలమున నేను మంచికథ యేదైనఁ జెప్పినప్పుడు నీవు మాతోఁగూడి నవ్వఁబోకుమా

భీమ— మీరు పిల్లి పాలుత్రాగదన్న రామలింగము కథమాత్రము చెప్పఁగూడదు. ఆ కథ చెప్పినప్పుడు నేను నవ్వాపుకోలేను ఆహా-హా-హా-హా-హా ఆ కథ విన్నప్పుడెల్ల రెండేండ్లఁబట్టి యొక్కవిధముగా నవ్వుచున్నాను

పురా— ఆహా-హా-హా-హా! అది మంచికథ ఆకథ చెప్పినప్పుడుమాత్రము నీవు నవ్వవచ్చును అయినను నీ వదేవనిగా నవ్వక పెద్దమనుష్యు లేమైన కావలెనని యడిగినప్పుడు తక్షణము పోయి తేవలెను. వారిలో నెవ్వరైనను పోళీలు కావలె నని యడిగినపక్షమున, మీ రెట్లు ప్రవర్తించెదరు? ఓ భీమా! మొద్దులాగున కదలవేమి?

భీము— ఎవ్వరైనను పోళీలు తెచ్చి నాచేతి కిచ్చువఱకును నాకు చురుకుతనము రాదు. ఆపయిని నేను సింహమువలె పనిచేసెదను.

పురా— మఱియెవ్వరును కదలరేమి?

మొదటిసేవ— నాకేర్పఱిచిన స్థలమిది నేనిక్కడనుండి కదలఁగూడదు.

రెండవ— ఆ పని నాదికాదు

మూడవ— నాదంతకుముందేకాదు

భీము— ఆ పని నాదయియుండదు

పురా— ఓరి నిర్భాగ్యులారా! పెద్దమనుష్యులు విస్తళ్లముందు కూర్చున్నప్పుడుకూడ నెవ్వరో యొకరు తెచ్చి యడిగినది వడ్డింపక యిది నాపనికాదు నాపనికాదని మీలోమీరు తగవులాడుచు కూరుచుండెదరా? ఓరి బుద్ధిహీనులారా! నేను మూడుదినములనుండియు పడుచున్న ప్రయాసమంతయు వ్యర్థమయిపోయినదే. ఓరి మొద్దులారా! నేను సర్వమును మొదటినుండియు మరల మొగ్గలుపెట్టవలెను. మీకు బండిచప్పుడు వినఁబడుచుండలేదా? మీరు మీమీస్థలములకుఁ బొండి. నేనెదురుగాఁబోయి నా బాల్యస్నేహితుని పుత్రుని ప్రత్యుత్థానముచేసి పిలుచుకొని వచ్చెదను. (అని పోవుచున్నాఁడు.)

భీము— నే నెక్కడ నిలువవలెనో నాస్థలము నేను మఱచిపోయినాను.

సోము— నాపని నాకుఁ దెలియును నేనొక్కచోట నిలుపఁబడక వచ్చుచుఁ బోవుచు చురుకుగా నుండవలెను.

మొదటిసేవ— నాస్థలమెక్కడ?

రెండవ — నాకొకస్థలమని నియమము లేదు నేను పరుగెత్తిపోయి నావనిమీఁద నేనుండెదను.

(సేవకులు నానాముఖముల పరుగులెత్తుచున్నారు)

[అంతట చేత దీపముపట్టుకొని పరిచారకుఁడు దారిచూపుచుండఁగా, చంద్రభానుఁడును శూరసేనుఁడును ప్రవేశించుచున్నారు]

పరి— అయ్యా! ఇదిదారి ఇటురండి.

శూర— పగలెల్ల శ్రమపడి చీఁకటిలో తడవుకొనుచు తుదకు మంచియింటికే వచ్చినాము.

చంద్ర— ఎంతో సొమ్ము వ్యయపెట్టక సత్రము నిటువంటి మంచిస్థితిలో నుంచుట కష్టము.

శూర— ఇంత మంచియిల్లు దొరకినదని యప్పుడే సంతోషపడ నక్కఱలేదు. ఈ వ్యయమంతయు మనమీఁదనే పడునులే ముందిది చూచినప్పుడు సంతోషము వచ్చినను సొమ్మియ్యవలసివచ్చినప్పుడు సంతాపము రాకమానదు

చంద్ర— మార్గస్థులు ప్రతిసత్రములోను సొమ్మియ్యవలెను. మంచిసత్రములలో మన మనుభవించినదానికి సంతోషించి కొంచె మధికముగా నిత్తుము, చెడ్డసత్రములలో తిండిలేక వాడి విచారముతో నిత్తుము.

శూర— నీకీవిషయములో ననుభవమెక్కువ ఇన్నిదేశములు తిరిగి యిన్నిసంగతులు తెలిసినవాఁడవు స్త్రీలవద్ద నీకింత సిగ్గెట్లువచ్చినదాయని నా కాశ్చర్యమగుచున్నది.

చంద్ర— అది నాస్వభావము నే నెన్నిదేశములు తిరిగినను ముఖ్యముగా నాకాల మంతయు నేను పాఠశాలలలోను పాఠశాల లేనప్పుడు సత్రములలోను పుచ్చినాను. ఒక్క నాతల్లితో తప్ప మఱి యేస్త్రీతోను నేనిదివఱకు సిగ్గువిడిచి మాటాడి యెఱుఁగను

శూర— నలుగురుస్త్రీ లొకచోట చేరినప్పుడు నీచర్యచూచిన నా కద్భుత మగుచుండును స్త్రీలముందఱ నీయంత భయపడువానిని సిగ్గుపడువాని నీ లోకములో నేను మఱియెవ్వరిని చూడలేదు అప్పుడు నీమొగము చూచువారికి నీవు సమయము చూచి గదివిడిచి పాఱిపోవలెనని యత్నించుచున్నట్లు తోఁచకమానదు.

చంద్ర— నేను నిజముగానే వారినివిడిచి లేచిపోవలెనని యాలోచించుచుందును. వారితో మొగమెత్తి మాటాడవలెనని నాలో నేనెన్నిసారులో యుద్దేశించుకొందునుగాని వారి సుందరముఖములు చూడఁగానే నానోటినుండి మాటరాదు.

శూర— నీవు సత్రములు మొదలయినచోట్ల మాముందు పలుకుచుండు చమత్కారోక్తులలో సగము వారిముందు పలుకఁగలిగితివా—

చంద్ర— నేను స్త్రీలతో సరసాలాపములాడలేను వారిముఖము చూడఁగానే నానోరు మూఁతపడిపోవును మంచిచీర కట్టుకొని చక్కని యువతి నాయెదుటనిలువఁ బడఁగానే నామతిపోయి నాదేహము కంపమొందును అటుపయిని నానోరులేవదు.

శూర— ఆహాహాహా! ఇంత లజ్జకలవాఁడవు వరించుటకయి ముందు నీభార్యతో నెట్లు మాటాడఁ గలుగుదువు?

చంద్ర— నేను మాటాడలేను నాపక్షమున మాటాడి వరించుటకు నేనొక ప్రతినిధి నేర్పఱుచుకొనవలెను ఈడురాని బ్రాహ్మణకన్యవలె వరుని మొగము చూచి మాటాడవలసిన యావశ్యకము లేకయే వివాహము జరగిన బాగుండును అంతే కాని పొగమెఱుఁగని సుందరితో వివాహవిషయమున నోరుతెఱచి మాటాడుట మాత్రము నాచేతఁగాదు.

శూర— ఈమాటలకేమి కాని యిప్పుడు నీవు వరించుటకయి నీతండ్రి యాజ్ఞానుసారముగా వచ్చిన కన్యనుజూచి యెట్లు మాటాడఁ దలఁచుకొన్నావు?

చంద్ర— ఇదివఱ కితరస్త్రీలతో మాటాడిన విధముగానే. ఆచిన్నది నన్నేమయిన నడిగినప్పుడెల్ల తలవంచుకొని యవుననియో కాదనియో లెక్క రెండుమాటలతో నుత్తరము చెప్పెదను. కన్నెత్తి యాచిన్నదాని మొగమువంక మాత్రము చూడను; చూచినపక్షమున, ఆ రెండుమాటలునుగూడ నానోటినుండి పయికి రావేమో!

శూర— ప్రథమదర్శనదినమందే తిన్నఁగా మాటాడక యనాదరము చూపినయెడల, ఆచిన్నది యేమనుకొనునో!

చంద్ర— ఆ చిన్నదానిని సంతోషపెట్టుటకన్న నిన్ను సంతోషపెట్టుటకయి నేనిక్కడకు ముఖ్యముగా వచ్చినాను. నా పెండ్లికంటె నీపెండ్లివిషయమయి నాకాదర మధికము. మిత్రవిషయములో నేను నాచేతనైనంత సాయము చేసెదను. కీరవాణికి నీయందెంతో యనురాగము. ఆమెబంధువు లెవ్వరు నిన్నెఱుఁగరు; నా మిత్రుఁడ వగుటచేత నిన్ను వారియింట నుంచుకొని గౌరవించుటకు సందేహ ముండదు. ఆపయి పని నీగౌరవమునకు తగినట్లు నీవే చూచుకోవలెను.

శూర— మిత్రుఁడా! నీవన్నమాటకు నాకు విచారమగుచున్నది నేను నాగౌరవము చూచుకొని హీనుఁడనుగాను నేను ధనమున కాశపడి యామెను కామించిన నిర్భాగ్యుఁడనయిన పక్షమున, వివాహవిషయమున నీవు నాకేమియు సాయము చేయ నక్కఱలేదు. కీరవాణియొక్క శరీరమొక్కటియే నే నాశించినాను; అది మృతుఁడైన యామె తండ్రియొక్క యనుమతినిబట్టియు నామె యిష్టమునుబట్టియు నాసొమ్మయినది.

ఇంతకువెనుక కఠినపదార్థములగుండ ధ్వని యతిత్వరలోఁ బోవునని చెప్పియుంటిమిగదా. మనము నివసించియుండు భూమియుఁ గఠినపదార్థమగుటచే దానిగుండ ధ్వని బహుసులభముగ పోవుచున్నది ఇందువలననే నిశ్శబ్దముగనుండు రాత్రి రెండుయామములవేళ మన చెవిని భూమికి అంటిపెట్టియుండినచో ఎంతదూరమున జరుగుచున్న కలకలమునైన వినవచ్చును. కొందఱు గ్రంథకర్తలు పూర్వమున రాజులు శత్రుసైన్యముయొక్క రాక నిట్లె గనిపెట్టినట్లు వక్కాణించుచున్నారు. ఇది తప్పక నిశ్చయమై యుండవచ్చును

ఒకానొకప్పుడు ఇంగ్లాండుదేశమునకు రాజధానియైన లండన్ పట్టణమందు ముందెన్నఁడును వినియుండనివిధమున గానవినోదము జరుపఁబడినట్లు వినుచున్నాము. నాలుగైదుగాని అంతకంటె ఎక్కువగాని అంతస్థులుగల మేడలను లండన్ పట్టణమందు విశేషముగాఁ జూడవచ్చును. అట్టి యొకమేడ కడపటియంతరంబున నొకనాడు సభికులనేకులుకూడియుండిరి. వారందఱు కూరుచుండియుండినప్పుడు చావడిలో నొక చిన్నబల్లతప్ప మఱేదియును లేదు. కాని కొంతసేపగువఱకు నక్కడనున్నవారలందఱకు నమితానందము గలుగఁజేయునటుల అతివినోదకరమైన గానము వినవచ్చెను. ఇది మంత్రశాస్త్రమువల్లఁగాని దేవతామహిమవల్లఁగాని కలిగినదిగాదు ఇదివఱలో సన్ననిగొట్టములవెంబడి ధ్వని యతిస్పష్టముగ వినఁబడునని చెప్పియుంటిమిగదా! మేడకు దిగువ యంతరంబున కొందరు గాయకులు కూరుచుండి వారివారి శక్తిసామర్థ్యములను వివిధసాధనములచే నక్కడఁ గనఁబఱచుచుండిరి. వారిముఖంబుల కెదురుగ సన్ననిగొట్టములుంచఁబడినవి. ఈగొట్టములన్నియు మధ్యయంతరములగుండ కడపటి యంతరంబునందున్న చిన్న బల్లలోనికి చేర్పఁబడినవి. ధ్వని వాయుపథంబునకంటె కఠినద్రవ్యపథగామియైనచో నతిస్పష్టముగ వినఁబడనగును. ఈ గొట్టములన్నియు కఱ్ఱతో చేయఁబడినవి. గనుకనే పాడుచుండినవారెవరును లేకయే పైనున్న సభికులు గానవినోదము ననుభవించుచున్నారు ఇదియే దీనికి కారణముగాని మఱియొకటి కానేరదు.

ధ్వనివలనఁ గలుగు చలనతరంగములు తరలిపోవువిధము కొంచెమిందు ముచ్చటించుచున్నాము నిశ్చలముయిన నూతిలోఁగాని చెఱువులోఁగాని చిన్నరాతి నొకదానిని విసరినచో ఈదెబ్బవలన చలనము గలుగును. ఈ చలనము నీటిపదార్థమందుండు నణురూపభాగముల మార్గమున నిమిష నిమిషమాత్ర ప్రథమున తరంగములవలె తరలిపోవును. కాని పోయినకొలఁదిని చలనబలము తగ్గిపోవుటచేఁ దరంగము లంత స్పష్టముగఁ గానరావు. ఇట్లే ధ్వనితరంగములుకూడ తరలిపోవు